

ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 30.0

కనిష్ఠం : 17.0



రికార్డులు తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ నాగప్రభుకుమార్

సారాను అరికట్టాలి

జంగారెడ్డిగూడెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'సర్కిల్ పరిధిలో సారా తయారీని అరికట్టేలా ప్రత్యేక దృష్టి సారించాలి. తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా, సుంకం చెల్లించని మద్యం రవాణాపై నిఘా పెట్టాలి' అని జిల్లా ఎక్సైజ్,ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కెవి.నాగప్రభ కుమార్ ఆదేశించారు. జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్సైజ్ సీఐలు కె.శ్రీనుబాబు, వీరబ్రహ్మం ఉన్నారు.



మీర్జాపురంలో మహిళతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పరిశుభ్రత పాటించాలి..

నూజివీడు టౌన్/ఆగిరిపల్లి, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రత, అవగాహనతో ప్రమాదకర వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ అమృతం జాన్ అన్నారు. మీర్జాపురంలో కుష్ఠు, న్యుమోనియాపై ఇంటింటి సర్వే నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ధనమ్మ, ఏఎన్‌ఎంలు నాగమల్లేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఆగిరిపల్లి పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆగిరిపల్లి వైద్యాధికారి డాక్టర్ జగన్మోహన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఉద్యోగి మృతి

లోపలి పేజీలో..

క్షణక్షణం.. ఉత్కంఠ!



మావోయిస్టులను బస్సులో కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

భారీ భద్రత మధ్య కోర్టుకు..15 మంది మావోయిస్టుల తరలింపు

ఏలూరులో మంగళవారం ఉదయం మావోయిస్టుల అరెస్ట్ నుంచి బుధవారం రాత్రి ఏడు గంటలకు వారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించే వరకు అడుగడుగునా క్షణక్షణం ఉత్కంఠ నెలకొంది. అత్యంత కట్టుదిట్టమైన భారీ భద్రత మధ్య మావోయిస్టులను బుధవారం మధ్యాహ్నం ఏలూరు జిల్లా కోర్టులో హాజరు పరిచారు. వచ్చే నెల మూడో తేదీ వరకు వీరికి కోర్టు రిమాండ్ విధించడంతో రాత్రి ఏడు గంటల సమయంలో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

- పోలీసులు ఇబ్బంది పెట్టారా ? శరీరంపై గాయాలు వున్నాయా ?.. మావోయిస్టులను ప్రశ్నించిన మేజిస్ట్రేట్ మేరీ
- గోండు భాషలో సమాధానం.. తర్జుమా చేసిన కుక్కునూరు ఆదివాసీలు
- వారికి ఆధార్ కార్డులు లేకపోవడంతో మధ్యవర్తుల సమక్షంలో పంచనామా
- మూడో తేదీ వరకు రిమాండ్.. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు
- అరెస్టు నుంచి కోర్టుకు హాజరు పరిచే వరకు పర్యవేక్షించిన ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):ఏలూరు కేకేఆర్ గ్రీన్‌సిటీలోని బస చేసిన 15 మంది మావోయిస్టులను మంగళవారం ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో పోలీసులు, గ్రేహౌండ్స్ దళాలు ఆకస్మికంగా దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. వీరిని మహిళా పోలీస్ స్టేషన్ భవనంలో ఉంచి బుధవారం ఉదయం ఆరు గంటలకు రెండు బస్సుల్లో విజయవాడ తరలించారు. అక్కడ మీడియా సమావేశం అనంతరం తిరిగి ఏలూరు తీసుకొచ్చారు. ప్రభుత్వాసుపత్రి నుంచి వైద్యులను రప్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏ క్షణమైనా కోర్టుకు తీసుకొస్తారంటూ తెలియడంతో వారిని చూసేందుకు నగరవాసులు అధిక సంఖ్యలో కోర్టు ఆవరణ ప్రాంతానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో మహిళా పోలీస్ స్టేషన్ భవనం వద్ద రెండు ప్రత్యేక బస్సుల్లో వారిని కోర్టు వెనుక వైపు గేట్లను తీయించి లోపలికి తీసుకొస్తారనుకున్నారు. కానీ గేట్ల వరకు వచ్చి స్టేట్ బ్యాంక్ మీదుగా ఇండోర్ స్టేడియం, కలెక్టరేట్ మీదుగా తిరిగి మహిళా పోలీస్‌స్టేషన్ భవనానికి వెళ్లిపోయారు.



ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆధ్వర్యంలో మావోయిస్టులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

పోలీసులు ఇబ్బంది పెట్టారా ?

సాయంత్రం 4.30 తర్వాత బస్సుల్లో ఏలూరు స్పెషల్ మొబైల్ కోర్టుకు తీసుకొచ్చారు. వారందరికీ ముఖాలకు ముసుగులు, చేతులకు బేడీలు, లీడింగ్ చైన్ వేసి ఒక్కొక్కరికి ఇద్దరు పోలీసులు చొప్పున ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. కోర్టులోను వారిని లీడింగ్ చైన్, బేడీలతోనే హాజరు పరిచారు. ముగ్గురు - మిగతా 8లో



పట్టుబడిన ఆయుధాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఆ ఇల్లు చీకటిమయం



మావోలు దలదాచుకున్న కేకేఆర్ గ్రీన్ సిటీలో వున్న ఇంటిని చూడడానికి పలువురు బుధవారం ఆ ప్రాంతానికి వెళ్లారు. మంగళవారం రాత్రి వరకు ఆ భవనానికి పోలీసులు కాపలా ఉన్నారు. బుధవారం ఇంటికి తాళాలు వేసి ఉన్నాయి. పోలీసులు కన్పించలేదు. మరోవైపు చుట్టుపక్కల ఇళ్ల వారు గ్రీన్‌సిటీ ప్రాంతవాసులు తామంతా ఇన్ని రోజులు మావోయిస్టుల మధ్యలో ఉన్నామా.. అంటూ ఆశ్చర్యంతోపాటు కాస్తా భయాందోళనకు గురయ్యారు. ప్రస్తుతం ఆ ఇల్లు చీకటి మయంలో ఉంది.

అరెస్టయిన మావోయిస్టులు వీరే..

- అరెస్టయిన మావోయిస్టుల్లో సోడే లచ్చు అలియాస్ గోపాల్, సోడే లక్మా అలియాస్ భీమా, గంగి లక్ష్మి అలియాస్ మాదే, వెట్టి వెంకట్, మడకం వాగ, కాశ్యప్ భీమా అలియాస్ యోగేష్, పొడియం ఆనంద్ అలియాస్ దన్ను, మడకం లక్ష్మణ్ అలియాస్ కోస, కుంజుం బుజ్జి, తాటి కమల, దూది అడ్డు అలియాస్ మల్లేష్, మాధవి జోగా, మాధవి సునీత, కుంజుం నందిని, బాదిశ రాజు ఉన్నారు.
- సోడే లచ్చు ఆయుధాలు తయారు చేయడం, వివిధ ఆపరేషన్లకు నాయకత్వం వహించేవాడని ఎస్పీ కేపీఎస్ కిశోర్ వివరించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ఏపీ పోలీస్ ఆపరేషన్ విజయవంతం చేసి 15 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తూ ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో అనేక ఘటనలకు పాల్పడ్డారన్నారు. ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో తల దాచుకోవడానికి మాత్రమే ఈ ప్రాంతానికి వచ్చారని, తదనంతరం ప్రణాళికలతో కార్యకలాపాలు నిర్వహించడానికి సిద్ధమయ్యారన్నారు.

ముందుగానే అప్రమత్తం

- కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌పీఎఫ్ భద్రత
- మావోయిస్టులు గోదావరి దాటి ఏలూరులోకి ప్రవేశించినట్లు అనుమానం !
- జాలర్లను అప్రమత్తం.. అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసుల ఆదేశం

కుక్కునూరు/వేలేరుపాడు, నవంబరు 19(ఆంధ్ర జ్యోతి): ఏజెన్సీలోని కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌కు ఇరవై రోజుల క్రితమే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) బృందం వచ్చింది. అప్పటి నుంచి ఈ బృందం కుక్కునూరు పోలీస్ స్టేషన్‌కు భద్రత కల్పిస్తూ పహారా నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివాసీ గ్రామాలను సందర్శిస్తూ నిఘా పెంచారు. ఇదంతా చూస్తుంటే పోలీస్ యంత్రాంగం ముందే అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ఇటీవల దండకారణ్యంలో జరుగుతున్న కూంబింగ్, ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులు ఆంధ్ర ప్రాంతానికి తరలి వస్తున్నారనే ఇంటెలిజెన్స్ ముందే గుర్తించింది. గోదావరి దాటితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాలున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం ముందస్తుగానే అప్రమత్తమై పోలీస్ స్టేషన్లకు భద్రత పెంచింది.

వేలేరుపాడులో హైఅలర్ట్

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తప్పించుకున్న మావోయిస్టులు గోదావరి దాటి వచ్చి వేలేరుపాడు మండలంలోని అటవీ ప్రాంతంలో తలదాచుకునే అవకాశం ఉన్నందున పోలీసులు నిఘాను పెంచారు. మంగళవారం ఏలూరులో పట్టుబడిన మావోయిస్టులు ఏ ప్రాంతం మీదుగా ప్రయాణించి ఏలూరు చేరుకున్నారన్న దానిపై పోలీసులు దృష్టి పెట్టారు. అల్లూరి జిల్లా చింతూరు, వరరామచంద్రాపురం మండలాల నుంచి గోదావరి - మిగతా 8లో



వేలేరుపాడు వద్ద పోలీసుల తనిఖీలు

పంటల ప్రోత్సాహానికి ప్రణాళిక

- మంత్రి నాదెండ్ల మనోహర్
- పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ సొమ్ముల చెక్కు విడుదల

ముదినేపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):వరి, ఆక్వా కల్చర్‌తో పాటు ఉద్యానవన పంటలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర ప్రణాళికను రూపొందిస్తోంది. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఏ పంటకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయో సర్వే చేసి ఆయా పంటల సాగును చేయాలన్నది ప్రభుత్వ ధ్యేయం'మని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలోని లక్షా 60 వేల మంది రైతులకు మంజూరైన రూ.106 కోట్ల నిధుల చెక్కును బుధవారం ఆయన ముదినేపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమంలో విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ 'జిల్లాలో అరటి, కొబ్బరి, పామాయిల్, కోకో తదితర మెట్ట పంటల సాగుకు ప్రభుత్వం మరింత ప్రోత్సహకాలు, సబ్సిడీలను ఇచ్చేందుకు కార్యాచరణ ఊపందుకుంది. వైసీపీ హయాంలో కౌలు రైతులను కులాల వారీగా విడదీసి పక్షపాతంతో చూశారు' అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ సాగునీటి ఎద్దడి లేకుండా డెల్టాలో నీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనతో పాటు వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఢిల్లీరావు, ఏసీ అభిషేక్ గౌడ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ముదినేపల్లి మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, బీజేపీ జిల్లా కో-కన్వీనర్ కోటప్రోలు కృష్ణారావు, జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా మంత్రి మనోహర్‌ను నియోజకవర్గ కూటమి నాయకులు సత్కరించారు.



ముదినేపల్లిలో పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ నిధుల చెక్కును విడుదల చేస్తున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కలెక్టర్ వెట్రిసెల్వి

చలిపులిని తరిమేలా..!

- సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ఏలూరు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గుతుండటంతో చలి బాగా పెరుగుతోంది. దీంతో ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని హాస్టళ్లకు దుప్పట్లు రాకపోగా మరికొన్నింట్లో మంచాలు లేక కింద పడుకోవాల్సి వస్తోంది. చాలాచోట్ల విరిగిన కిటికీలు, తలుపులు ఉండటంతో చలి తీవ్రత పెరిగి విద్యార్థులు వణుకుతున్నారు. సరిగ్గా నిద్రపట్టక చదువుల మీద శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం హాస్టళ్లలోని విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మౌలిక వసతులు కల్పనకు పూనుకుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 56 ఎస్సీ వసతి గృహాల విద్యార్థులకు ప్రభుత్వం దుప్పట్లు, జంపకానాలు సరఫరా చేసింది. మూడో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే సుమారు ఆరు వేల మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇంకా జంపకానా బండిళ్లు రావాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ హస్టళ్లలో సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసింది. శిథిల భవనాలు, అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ వసతి గృహాల ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్) నిధులతో పలు వసతి గృహాలకు మరమ్మతు పనులు చేపట్టారు. కిటికీలు, తలుపులు కొత్తవి అమర్చారు. మరుగుదొడ్లను బాగు చేయించి విద్యార్థులకు అందుబాటులో తెచ్చారు. ప్రతీ వసతి గృహానికి రూ.1.5 లక్షలు చొప్పున కేటాయించి కొత్తగా మిక్సీలు, గ్రైండర్లు, వంట పాత్రలు సమకూర్చారు.



పంపిణీ చేసిన దుప్పట్లతో ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

నా కుర్చీకే ఎసరు పెడతావా?!

- ఉద్యోగులతో మాట్లాడే తీరు ఇలాగేనా?
- పనితీరు, ప్రవర్తన మార్చుకోకపోతే నేనే యాక్షన్ తీసుకుంటా!
- విద్యాశాఖలో వివాదాస్పద అధికారికి డీఈవో హెచ్చరిక.. ఆ అధికారితోపాటు ఉద్యోగులతో సమన్వయ సమావేశం
- వివాదానికి తెరదించేందుకు ప్రయత్నం

ఏలూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):'ఆఫీసు సిబ్బందితో మీరు మాట్లాడేతీరు, ప్రవర్తన మార్చుకోకపోతే డైరెక్ట్‌గా యాక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. గతంలో కొంత కాలం డీఈవోగా పనిచేసినంత మాత్రాన ఇప్పుడు ఈ జిల్లాలో నా సీటే మీకు ఇస్తారని ఎవరు చెప్పారు? అందరిని ఏకవచనంతో సంబోధించడం సరైందికాదు. ఇదే జిల్లాకు డీఈవోగా వచ్చి అందరి సంగతి చూస్తానని బెదిరిస్తున్నారట కదా ? మహిళా ఉద్యోగులని చూడకుండా నోటికొచ్చినట్టు మాట్లాడవచ్చా ? ఆఫీసు పరువు తీస్తే సహించేది లేదు'.. అంటూ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వివాదాస్పద ఓ అధికారికి డీఈవో వెంకటలక్ష్మమ్మ గట్టి వార్నింగ్ ఇచ్చినట్టు తెలిసింది.

డీఈవో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ అధికారి దుష్ప్రవర్తనతో విసుగు చెందిన ఆఫీసు ఉద్యోగులు ఆయన వద్ద పనిచేయలేమని మూకుమ్మడిగా డీఈవోకు కొద్దిరోజుల క్రితం తెలిపిన నేపథ్యంలో బుధవారం అంతర్గత సమావేశం జరిగినట్టు సమాచారం. కార్యాలయంలో ఎవరితోనూ సఖ్యత లేకపోవడంతో ఆ అధికారిని ఆఫీసు సిబ్బంది యావత్తూ మూడు రోజులుగా బహిష్కరించడం, ఆయనకు స్పందించకపోవడంతో ఏర్పడిన సంక్షోభాన్ని చక్కదిద్ది, ఇరువర్గాల మధ్య సమన్వయం తెచ్చేందుకు డీఈవో చొరవ తీసుకుని వారితో సమావేశం జరిగినట్టు తెలిసింది. ఈ సమావేశానికి వివాదాస్పద అధికారిని, ఆఫీసు ఉద్యోగులను పిలిపించి ఇరువైపులా ఆరా తీసినట్టు తెలిసింది.

అధికారిపై తాము ఇటీవల ఇచ్చిన ఫిర్యాదుకే కట్టుబడి ఉన్నామని, ఆఫీసు ఉద్యోగులను, ముఖ్యంగా మహిళా ఉద్యోగులను దుర్భాషలతో వేధిస్తున్న విష యాలను డీఈవో వద్ద మరోదఫా ప్రస్తావించి నోటి దురుసుతో వ్యవహరిస్తున్న అధికారిపై శాఖాపరమైన విచారణకు తమ ఫిర్యాదును విద్యాశాఖ డైరెక్టర్‌కు నివేదించాల్సిందేనని కొందరు ఉద్యోగులు పట్టుబట్టినట్టు సమాచారం. అదే సమయంలో ఆ అధికారి వ్యవహారశైలిని డీఈవో కూడా తప్పుబట్టడంతో పాటు, తనను ఇతరులవద్ద కించపర్చేలా ఆ అధికారి మాట్లాడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని కార్యాలయ ఉద్యోగుల ఆవేదనతో ఏకీభవించినట్టు తెలిసింది. వాస్తవానికి గతంలో కొంతకాలం ఇన్‌చార్జి డీఈవోగా ఓ జిల్లాలో పనిచేసిన కాలంలో ఆ అధికారి దుష్ప్రవర్తన వల్లే ఆ జిల్లా సర్వోన్నతాధికారి సరెండర్ చేసిన విషయాన్ని సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు తెలుస్తోంది. తాను గతంలో సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఓ జిల్లాకు అధికారిగా పనిచేసినపుడు అప్పటి ఎస్పీడీతో వున్న పరిచయాన్ని సాకుగా చూపిస్తూ, ఈ జిల్లాలో ఆ పరిచయంతో డీఈవో కార్యాలయ ఉన్నతాధికారి వద్ద, మిగతా ఉద్యోగుల వద్ద బెదిరింపులకు పాల్పడుతుం డటంపై హాట్‌హాట్‌గానే ప్రశ్నించినట్టు సమాచారం. ఇదేక్రమంలో పొరుగు జిల్లాలకు చెందిన ఎమ్మెల్సీల పేర్లను అక్రమంగా వాడుకుంటూ డీఈవో కార్యాలయ ఉద్యోగులను వేధిస్తున్న విషయాలపై నిలదీసినట్టు తెలిసింది. ఓవైపు డీఈవో, మరోవైపు కార్యాలయ ఉద్యోగులు మూకుమ్మడిగా తమ ప్రశ్నల పరంపరతో ఆవేదనను వెళ్లగక్కడంతో బిత్తరపోయిన ఆ అధికారి తన నోటి దురుసుతనంపై వివరణ ఇచ్చుకుంటూనే, రేపటి నుంచి నాపని నేను చేసుకుంటానని, ఎవరినైనా ఇబ్బందిపెట్టి ఉంటే క్షమించాలని చెప్పినట్టు సమాచారం. మరోవైపు ఆ అధికారి తనపై వచ్చిన వివాదాలకు వివరణ ఇచ్చుకుని, ఇకమీదట పునరావృతం కానివ్వబోనని హామీ ఇచ్చినందున ఒక అవకాశం ఇద్దామని కార్యాలయ ఉద్యోగులు కొందరు సర్దిచెప్పే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. అంతర్గత సమావేశంలో వాదనలు జరుగుతుండగానే విద్యాశాఖ ఉన్నతాధికారుల వెబెక్స్ సమావేశానికి సమయం కావడంతో ఈ వివాదంపై మరోదఫా సమావేశమవుదామని అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు సమాచారం. కాగా సమావేశం వివరాలను బహిర్గతం కాకుండా మౌనం పాటిస్తుండటం గమనార్హం. ఈ విషయమై వివరణ కోసం ప్రయత్నించగా డీఈవో కార్యాలయ వర్గాలు నిరాకరించాయి.



నీడనిచ్చే చెట్లు నరికివేత

ఏలూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):ఏలూరు నగరం సమీపంలోని సత్రంపాడులో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నీడనిచ్చే భారీ చెట్లను కొందరు దుండగులు నరికి వేసి ఎత్తుకుపోయారు. చాలాకాలంగా ఆహ్లాదాన్ని పంచిన ఈ చెట్లను ఎవరి నరికేశారో తెలియడం లేదని స్థానికులు చెబుతున్నారు. టోల్‌గేట్ సందులోనే వరుసగా ఏపుగా పెరిగిన మొక్కలు నరికివేసిన విషయంపై ఏపీఐఐసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏపీఐఐసీకి చెందిన కామన్‌సైట్ పార్కులోనూ మొక్కలను దుండగులు నరికివేసి ఎత్తుకుపోయారని.. తాము ఎవ్వరికి ఫిర్యాదు చేయాలో అర్థం కావడం లేదని సీనియర్ సిటిజన్లు వాపోతున్నారు.

రైతుల కళ్లల్లో ఆనందం

పెట్టుబడికి ఉపయోగకరంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం సొమ్ములు

భీమవరం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సార్వా సాగు పెట్టుబడికి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం సొమ్ములు ఉపయోగకరంగా మారాయి. మొదటి విడత సొమ్ములు సాగు ఆరంభం పెట్టుబడికి, రెండో విడత సొమ్ములు పంట మాసూళ్లు, వచ్చే దాళ్వా సాగు ఆరంభానికి పెట్టుబడిగా పెడుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా రైతుకు రూ. 20 వేలు అందించడం సాగు చేసేవారికి ప్రోత్సాహంగా నిలిచింది. ఇప్పటికే రెండు విడతలుగా రూ.14 వేలు రైతుల ఖాతాలలో జమ అయ్యాయి. మిగిలిన సొమ్ములు మూడో విడతగా ప్రభుత్వం జమ చేయనుంది. రెండో విడత సొమ్ములు జమ కార్యక్రమంలో రైతులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని ఆర్ఎస్‌కేలలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గాల కేంద్రాల్లోనూ చేపట్టారు. రైతుకు సాగులో సబ్సిడీ మీద ఇస్తున్న యాంత్రిక పనిముట్లు, ధాన్యం విక్రయాలు, సొమ్ములు జమలు వివరాలను రైతులకు అధికారులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి రెండో విడతగా 1 లక్షా 3 వేల 761 మంది రైతులకు ఖాతాల్లోకి రూ.68.97 కోట్లు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కింద జమ కానున్నాయి.

మాసూళ్లకు ఉపయోగం



ఎన్నడూ లేని విధంగా వరిసాగు రైతులకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది. రైతుకు రూ.20 వేలు అందించడం గొప్ప విషయం. పంట మాసూళ్లకు ఉపయోగపడ్డాయి. ఈ తరుణంలో రూ.7వేలు రైతు చేతికి అందడం పంట మాసూళ్ల నిమిత్తం కూలీలకు ఇవ్వడానికి వీలవుతుంది.

- కె.పెద్దిరాజు
రైతు, భీమవరం మండలం

భరోసాగా ప్రభుత్వ సాయం



వరిసాగు అంటే ఒడిదుడుకులు ఎదుర్కోవాలి. అలాంటి రైతులకు ప్రభుత్వం పంట పెట్టుబడికి అన్నదాత సుఖీభవగా సొమ్ములు ఖాతాలో వేయడం భరోసాగా ఉంది. సార్వా సాగు ఆదిలో మొదటి విడత వేశారు. నాట్లు, ఇతర పెట్టుబడికి ఉపయోగించాం. రెండో విడత మాసూళ్లు, దాళ్వా నారుమడికి ఉపయోగపడుతుంది.

- కె. రామకృష్ణ
రైతు, భీమవరం మండలం

రైతు సంఘం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పుల్లారెడ్డి, హరేరాం





పుల్లారెడ్డి హరేరాం

పాలకోడేరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంఘం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా చిర్ల పుల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆకుల హరేరాం ఏకగ్రీవంగా నియమితుల య్యారు. మోగల్లులో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న రైతు సంఘం 23వ జిల్లా మహాసభ బుధవారంతో ముగిసింది. దీనిలో భాగంగా జిల్లా నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా ఉపాధ్యక్షులుగా కిలారి తవిటినాయుడు, గుత్తుల శ్రీరామచంద్రుడు, జిల్లా సహాయ కార్యదర్శులుగా తాళ్యూరి హరిహరలక్ష్మణ్, తూటే మార్టిన్ లూథర్‌ను ఎంపికయ్యారు. వీరితోపాటు మరో 12 మంది సభ్యులు కమిటీ కలిపి మొత్తం 18 మందితో జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని పంటలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమస్యలపై నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం ధాన్యం క్వింటాల్‌కు రూ. 500 రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలి. కేరళ తరహాలో ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి. ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలి. పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి తదితర ఏడు తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

క్రీడా సమాచారం

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు
మండపాక పాఠశాల పీడీ ఎంపిక



సంకు సూర్యనారాయణ

తణుకు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీలకు తణుకు రూరల్ మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు సంకు సూర్యనారాయణ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె.ఫణిశ్రీ తెలిపారు. బుధవారం గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఏపీ సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. డిసెంబరు 13 నుంచి 17 వరకు బీహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయస్థాయి సివిల్ సర్వీసు అథ్లెటిక్స్ పోటీలలో మన రాష్ట్రం తరపున పాల్గొంటారని తెలిపారు. మండపాక పాఠశాల పీడీ సూర్యనారాయణ జాతీయస్థాయి సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం ఇదే మూడో సారి అని తెలిపారు. ఈ సందర్భంగా పీడీని గ్రామ సర్పంచ్ జాన వెంకటలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, పాఠశాల కమిటీ ఛైర్మన్ గూడూరి మహాలక్ష్మి, తదితరులు అభినందించారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మనోజ్ఞ



విద్యార్థిని మనోజ్ఞను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి సత్య ఉషారాణి

తణుకు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత కాలంలో బాలికలు క్రీడల్లో ఉత్తమంగా రాణించడం గర్వకారణమని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి అన్నారు. బుధవారం ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో తమ కళాశాలకు చెందిన మానె మనోజ్ఞ వ్యక్తిగత విభాగంలో ద్వితీయ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన్నట్లు ప్రిన్సిపాల్ హిమబిందు తెలిపారు. జనవరి రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు డిల్లీలో జరిగే పోటీలలో పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా పీడీలను అధ్యాపక సిబ్బంది అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఎస్‌జీఎఫ్ పోటీలకు 13 మంది కొవ్వలి విద్యార్థులు

దెందులూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, హాకీ పోటీలకు కొవ్వలి జడ్పీ హైస్కూల్‌కు చెందిన 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులడు ఎస్ఎల్ఎస్‌వీజీ శర్మ, పీడీలు జె.సురేష్‌కుమార్, గవ్వా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మూడు క్రీడాంశాల్లో జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అభినందించారు. వీరంతా వచ్చేనెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని వారు ఆకాంక్షించారు.

వాతావరణం

- మరో మూడు రోజుల్లో అల్పపీడనం • రైతుల్లో అలజడి.. • జిల్లాలో 23,700 ఎకరాల్లో మాసూళ్లు పూర్తి
- 72 వేల టన్నుల ధాన్యం దిగుబడి • ఇంకా ధాన్యం రాశులుగా 20 వేల మెట్రిక్ టన్నులు
- మొంథా తుఫాన్‌తో దిగుబడి ధమాల్... తెగుళ్ల దాడి



భీమవరంలో వరి పనలు గట్టుకు చేరుస్తున్న కూలీలు

మరో అల్పపీడనం అంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ముఖ్యంగా వరి రైతులు ముమ్మరంగా మాసూళ్లు చేస్తున్నారు. చాలా వరకు ధాన్యం కల్లాల్లోనే ఉన్నది. ఇటీవల మొంథా తుఫాన్ దెబ్బకు వరి రైతులు నష్టపోయారు. దిగుబడి తగ్గిపోవడంతో పాటు చేలు తెగుళ్ల బారిన పడ్డాయి. ఇప్పుడు వాతావరణంలో మారిన పరిస్థితులతో కూలీల రేట్లు, వరి కోత యంత్రాల కిరాయి భారీగా పెంచేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే కోలుకోలేని దెబ్బ తగులుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ధాన్యం ఆరబెడుతున్న రైతులు

భీమవరం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సార్వా మాసూళ్ల సమయంలో వాతావరణం గండంగా మారింది. మొన్న మొంథా తుఫాన్‌తో సాగులో రైతులు నష్టాలు చవిచూశారు. ఇప్పుడు పంట మాసూళ్లు ముమ్మరం కానున్న తరుణంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో రైతుల్లో అలజడి మొదలైంది. గడిచిన వారం రోజుల నుంచి పంట మాసూళ్లు సాగుతున్నాయి. ఈ నెల చివరి వారం నుంచి పంట మాసూళ్ల స్పీడు పెరగనుంది. ఇప్పటికి పశ్చిమ గోదావరి జిల్లాలో 23,700 ఎకరాలు మాసూళ్లు అయ్యింది. 72 వేల టన్నుల ధాన్యం దిగుబడిగా వచ్చింది. దీనిలో 30 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయాలు జరిగాయి. 20 వేల టన్నుల ధాన్యం ధాన్యంరాశులుగా ఉంది. దీనిలో తేమశాతం తగ్గించేందుకు రైతులు ఎండబెడుతున్నారు. రోజూ పంట మాసూళ్ళు జరుగుతుంది. ఇలాంటప్పుడు వాతావరణంలో మార్పు ఏర్పడితే మాసూళ్ళకు ఆటంకం ఏర్పడుతుంది. పంట దశకు చేరుకున్న చేలు దెబ్బతింటాయి. అందువల్ల మరో మూడు రోజుల్లో ఏర్పడుతుందన్న అల్పపీడనం వల్ల ప్రభావం ఉండకూడదని రైతులు ఆశిస్తున్నారు.

మొంథా తుఫాన్‌తో దిగుబడిపై ప్రభావం

గతనెల చివరి వారంలో వచ్చిన మొంథా తుఫాన్ సార్వా సాగు నష్టమే చేకూర్చింది. జిల్లాలో దాదాపుగా 20 వేల ఎకరాలకు నష్టం చేకూరింది. మిగిలిన సాగులో కొంత సాగుకు తెగుళ్లు వచ్చేలా చేసింది. ఎండకు పొడ తెగుళ్ళ వల్ల పంటచేలు రూపు మారి దిగుబడి పడిపోయింది. వర్షపు నీరు చేలల్లో అధికంగా చేరి మాసూళ్ల ఆలస్యానికి కారణమైంది. కొంత సాగులో ధాన్యం గింజలకు అణకామ ఏర్పడింది. దీనివల్ల దిగుబడి బాగా తగ్గిపోతుంది. ఇప్పుడు మరోసారి వర్షాలు పడితే మిగిలిన సాగుకు భారీ నష్టం తప్పదు.

ధాన్యంలో తగ్గని తేమ

సార్వా పంట మాసూళ్ల చేసేటప్పుడే ఎండ తీవ్రత తగ్గి చలి పెరుగుతుంది. దీంతో ధాన్యం తేమ శాతం తగ్గించడం కోసం రైతులు అష్టకష్టాలు పడాలి. వారంరోజులుగా చలి బాగా ఎక్కువైంది. ధాన్యానికి 17 తేమ శాతం తేవడానికి రైతులు నాలుగు రోజులుపైనే ఎండ బెడుతున్నారు. గతంలో రెండు రోజులు ఎండబెడితే సరిపోయేది. మరలా అల్పపీడనం ఏర్పడి మబ్బులు పడితే ధాన్యం ఎండ బెట్టడం చాలా కష్టం.

పెరిగిన వరి యంత్రాల కిరాయి

గణపవరం: వాతావరణ పరిస్థితులు, కూలీలతో కోతలు కొయ్యడానికి పెట్టుబడి ఎక్కువ కావడంతో అన్నదాతలు అత్యధికంగా యంత్రాలతో వరిని కోయిస్తున్నారు. ముఖ్యంగా పొలాలు పైకి బాగానే ఉన్నప్పటికి దిగుబడులు తగ్గాయని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో పంటకోతకు వచ్చింది. ఇటీవల వరకు యంత్రంతో వరిని కొయ్యడానికి గంటకు రూ.3వేలు తీసుకుంటే ప్రస్తుతం రూ.3500-4000 వరకు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నలుపు, తాలుగా మారాయి..

తుఫాన్ సమయంలో వీచిన పెనుగాలులకు వంద లాది ఎకరాల్లో వరిపంట నేలవాలింది. ఆ పంటను అధికారులు గుర్తించి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదించారు. అయితే నిలుచుని ఉన్న పొలాలు దెబ్బతిన్నాయి. గాలులకు వరి కంకుల తమ్మెలు పగిలిపోయి తాలుగా మారిపోయాయని రైతులు చెబుతున్నారు. ఎకరానికి 35బస్తాలకు పైగా దిగుబడి వస్తుందని ఆశిస్తే 25- 28 మాత్రమే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుఫాన్‌తో మాసూళ్లు ఆలస్యం
వెంకట రమణ, రైతు, తాడేరు



చలి బాగా పెరిగిపోయింది. ధాన్యం తేమ శాతం తగ్గడం లేదు. దీనికి తోడు మరో అల్పపీడనం అంటున్నారు. పంట మాసూళ్లు ఎలా చేయాలి. మొంథా తుఫాన్‌తో పంట మాసూళ్ళు ఆలస్యమైంది. పది రోజుల క్రితం మాసూళ్ల చేయాలి. ఇంకా చేను అలాగే ఉండిపోయింది. మిషన్‌లు దొరకడం లేదు.

వర్షాలు పడితే కష్టమే
జి. వెంకటేశ్వరరావు, గునుపూడి



మొన్న మొంథా తుఫాన్ వల్ల పది ఎకరాల చేను పంట సరిగా పండలేదు. ఎండాకు తెగ్గుజీ వచ్చేసింది. నీరు ఎక్కువ్వడం వల్ల పొడ, ఊచపోటు వచ్చాయి. సగం పంట తగ్గిపోయింది. మరలా అల్పపీడనం అంటున్నారు. వర్షాలు పడితే వదిలేసుకోవడమే జరుగుతుంది.







పాలకొల్లు క్షీరా రామంలో లక్ష దీపోత్సవంలో భాగంగా దీపాలు.. గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో అర్చన..

క్షీరా రామంలో లక్ష దీపోత్సవం

పాలకొల్లు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పాలకొల్లులోని పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి లక్ష దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ పాలక మండలి ఛైర్మన్ మీసాల రాము దంపతులు, ట్రస్టీలు, ఈవో ముచ్చర్ల శ్రీనివాస్ దంపతులు పూజలు చేసి ప్రారంభించారు. ప్రతీ ఏటా కార్తీక మాసంలో పౌర్ణమి తరువాత లక్ష దీపోత్సవాన్ని నిర్వహిస్తారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.వాసు, సిబ్బంది. అర్చకులు కిష్టప్ప, పూర్ణయ్య, అనిల్‌కుమార్ శర్మ, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయం..

క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిట కిటలాడింది. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు 6,000 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

మద్ది ఆంజనేయస్వామికి పూజలు

జంగారెడ్డిగూడెంరూరల్, నవంబరు 19, (ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో కార్తీకమాస మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. లక్ష తమల పాకులతో అష్టోత్తర పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణలు, అన్నప్రాసనలు, వాహన పూజలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తొలుత స్వామి వారికి లక్ష తమలపాకులతో లక్షార్చన పూజను ఆలయ అర్చకులు, వేద పండితులు, ఋత్విక్కులు వైభవంగా నిర్వహించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు దంపతులు స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. దేవస్థానంకు బుధవారం ఒక్కరోజే పలు సేవల రూపంలో రూ.2,35,400 ఆదాయం సమకూరినట్టు ఈవో చందన తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

సోమేశ్వరస్వామికి అభిషేకాలు

భీమవరంటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గునుపూడిలోని సోమేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఈవో డి. రామకృష్ణంరాజు, ఛైర్మన్ చింతలపాటి బంగ్రా రాజు పర్యవేక్షించారు.

ప్రసవాలు, వైద్య సేవల్లో
వేల్పూరు పీహెచ్‌సీ ఫస్ట్



వేల్పూరు పీహెచ్‌సీ భవనం

తణుకు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాలో అత్యధిక ప్రసవాలు చేయడంతో పాటు ఇతర వైద్య సేవలు అందించడంతో తణుకు రూరల్ మండలం వేల్పూరు పీహెచ్‌సీ జిల్లాలో గ్రేడ్-1తో ఫస్ట్, రాష్ట్రస్థాయిలో గ్రేడ్-2 సాధించిందని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కె.సాయి భవాని, డాక్టర్ పీ సాయిగిరిరెడ్డి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సూచనల మేరకు పీహెచ్‌సీలో మౌఖిక, బ్రెస్ట్, గర్భాశయ ముఖ (సర్వేకల్) క్యాన్సర్‌లకు సంబంధించిన ప్రాథమిక పరీక్షలు పీహెచ్‌సీ వద్ద క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గర్భిణులు, చిన్న పిల్లలకు ప్రాథమిక పరీక్షలు, వైద్య సేవలు క్రమం తప్పకుండా అందిస్తున్న సేవలకుగాను జిల్లాలో మొదటిస్థానంలోనూ, రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో పీహెచ్‌సీ నిలిచినట్లు తెలిపారు. పీహెచ్‌సీలో సూపర్‌వైజర్లు ఉదయలక్ష్మి, జె.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది సమష్టి కృషితోనే ఈ స్థానాలు సాధించినట్టు తెలిపారు.

విద్యా వ్యవస్థ మెరుగుపడేదెలా ?

- పాఠశాలల సమయంలో బయట తిరుగుతున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు
- లోపించిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఆకివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థ మసకబారుతుంది. మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేయాలని చూస్తుంటే కొంతమంది హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. దీనికి ఉదాహరణే.. ఆకివీడులోని మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల. పాఠశాల సమయంలో హెచ్‌ఎం బయట తిరగడం.. పాఠశాలకు సంబంధంలేని హెచ్‌ఎం భార్య విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ నిర్వహణ చేస్తుంది. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 90 మంది విద్యార్థులకు విద్యాబోధన జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇద్దరు లేక ముగ్గురు ఉపాధ్యాయులు సరిపోతారు.. అయితే మోడల్ స్కూల్ కావడంతో ఐదుగురు ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యాబోధన చేయిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా కుర్చీలు, బెంచీలు ఉన్నా వాటిని వినియోగించుకోకుండా కొంతమంది విద్యార్థులను నేలపై కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాల సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థులను పట్టించుకోకపోవడంతో దెబ్బలాడుకుని గాయాలపాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందని, ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై ఎంఈవో రవీంద్రను వివరణ కోరగా పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న వాటిపై విచారణ చేసి చర్యలు చేపడతానన్నారు. సంబంధం లేనివారు స్కూల్‌కు రాకుండా చూస్తానని, హెచ్‌ఎం బయట తిరుగుతున్న దానిపై విచారణ చేస్తానన్నారు. బెంచీలు ఉండగా కింద కూర్చోబెట్టడానికి కారణంగా తెలుసుకుని, ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు.



విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న హెచ్‌ఎం భార్య(ఇన్‌సెట్‌లో) స్కూల్ సమయంలో హెచ్‌ఎం బయటకు వెళ్లడంతో ఖాళీగా ఉన్న కుర్చీ





విద్యార్థులను నేలపై కూర్చోబెట్టి పాఠాలు ← ఖాళీగా వున్న బెంచీలు →

300 మంది మత్స్యకారులకు బోట్లు, వలలు

- పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల జీవన స్థితిగతుల్ని పెంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. బుధవారం పీఎంలంక డిజిటల్ భవనం వద్ద రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సేవాదృక్పథంతో మత్స్యకారులకు అండగా నిలవాలని రామకృష్ణ మిషన్ 300 పడవలు, వలలు అందించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. వీటిని ఉపయోగించుకుని మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారుల స్థితిగతులపై ప్రభుత్వం సర్వే చేయిస్తుందని, తద్వారా రుణాలు, వలలు అందించే యోచనలో ఉందన్నారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మాట్లాడుతూ తొలి విడతగా వంద మందికి బోట్లు, పడవలు అందిస్తామన్నారు. మరో విడతలో మిగిలిన 200 మందికి అందిస్తామన్నారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో దాసి రాజు, మైలా వసంతరావు, తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ, ఎఫ్‌డీవో ఏడుకొండలు పాల్గొన్నారు.

రేపు నరసాపురంలో ప్రపంచ మత్స్య దినోత్సవం

నరసాపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైవే ఇన్ కల్యాణ మండపంలో ఈనెల 21న ప్రపంచ మత్స్య దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తీర ప్రాంత మత్స్యకార సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం జనసేన కార్యాలయంలో సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు మాట్లాడుతూ జిల్లాలో జరిగే ఈ సదస్సుకు మత్స్యకారులంతా పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి, నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, విప్ నాయకర్ విచ్చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లాల మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు మైలా వసంతరావు మాట్లాడుతూ ఎంపిక చేసిన మత్స్యకారులకు వేట సామగ్రిని అందిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర అగ్నికుల సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవి మాట్లాడారు. వాతాడి కనకరాజు, కె.గోపి, పి.నాగబాబు, బొడ్డు ఆశిష్‌కుమార్ పాల్గొన్నారు

రొయ్యల సాగులో మెలకువలు తెలుసుకోవాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

నరసాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో చాలామంది రైతులు ఆక్వా సాగు చేస్తున్నారని, సాగుపై సరైన అవగాహన లేకపోవడం వల్ల నష్టపోతున్నారని, ముఖ్యంగా సాగులో మెలకువలు తెలుసుకోవాలని జాతీయ మత్స్య అభివృద్ధి మండలి విస్తరణ సంచాలకులు డాక్టర్ మాధవన్ సూచించారు. లక్ష్మణేశ్వరంలోని ఆక్వా యూనివర్సిటీ కాలేజీలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో రొయ్యల సాగుపై నిర్వహించే మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు బుధవారం పారంభించి, సంబంధిత బ్రోచర్‌ను ప్రొఫెసర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ తీర ప్రాంతంలో ఆక్వా రైతులకు సాగులో చేపట్టాల్సిన మెలకువలు, రొయ్య పిల్లల ఎంపిక, మందులు వాడకం, వ్యాధుల నిర్మూలన తదితర విషయాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ టి.నీరజ, ఆర్.అరుణ్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మాధవి, ఎస్.వీరభద్రరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రావణి పాల్గొన్నారు.

అయ్యప్పలకు హాస్యనటుడు సారిక అల్పాహారం



అయ్యప్పస్వాములతో సినీ హాస్య నటుడు సారిక రామచంద్రరావు దంపతులు

పాలకొల్లు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాలధారణతో ఆధ్యాత్మిక భావంతో పాటు హిందూ ధర్మం వర్ధిల్లుతుందని ప్రముఖ సినీ హాస్య నటుడు సారిక రామచంద్రరావు అన్నారు. బుధవారం ఉదయం ఆయన నివాసంలో అయ్యప్ప స్వాముల భజనలు అనంతరం స్వాములకు భార్య విజయలక్ష్మి కళావతితో కలిసి అల్పాహారం, పండ్లు అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదం అందజేశారు.

పారిశుధ్యం మెరుగుదలతో సంపూర్ణ ఆరోగ్యం



రాయకుదురులో మరుగుదొడ్డిని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

వీరవాసరం (భీమవరం టౌన్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగుదల ద్వారా ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించగలుగుతారని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వీరవాసరం మండలం రాయకుదురు గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ - స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులతో నిర్మించిన మరుగుదొడ్డిని ప్రపంచ టాయిలెట్ డే సందర్భంగా బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలందరూ వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లను మాత్రమే వినియోగించాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారి కె.శ్రీనివాసరావు, డీఈఈ టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో వైభవతి, తహసీల్దార్ ఏవి రామాంజనేయులు, గ్రామ సర్పంచ్ గడ్డం భారతి, లబ్ధిదారు వనచర్ల లక్ష్మీ, తదితరులు ఉన్నారు.

మొగల్తూరు: బహిరంగ మలవిసర్జనతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ సూచించారు. వరల్డ్ టాయ్‌లెట్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముత్యాలపల్లి సర్పంచ్ అడ్డాల సూరిబాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

తణుకు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. డిసెంబరు 7న తణుకులో మారథాన్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తెలిపారు. తణుకు పట్టణంలో 3, 5, 10 కిలో మీటర్లు చొప్పున పరుగు నిర్వహించడానికి చర్యలు చేపట్టామన్నారు. యువత, వ్యాపారులు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు ఔత్సాహికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పచ్చదనం పరిశుభ్రతపై శిక్షణ

పాలకోడేరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతపై గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు బుధవారం ఎంపీడీవో వి.రెడ్డియ్య ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో చెత్త ఎక్కడపడితే అక్కడ వెయ్యకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధంగా పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. ఈవోపీ అండ్ ఆర్‌డి రాంప్రసాద్, మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు: పారిశుధ్య పని ఒక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పీఫోర్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జున రావు అన్నారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల పరిషత్ కార్యాలయాల్లో వద్ద క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంపై సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవోలు వి.చంద్రశేఖర్, రాంప్రసాద్, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, టీవోటి టి.రవిచంద్ర, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇరగవరం: గ్రామాలను పరిశుభ్రంగా తీర్చేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఇరగవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అధ్యక్షతన బుధవారం గ్రీన్ విలేజ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వండి

తణుకు ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు

తణుకు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సమాచారం స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని ఎంపీపీ రుద్ర ధనరాజు కోరారు. ఎంపీపీ అధ్యక్షతన బుధవారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు ఈ సమస్యను ప్రస్తావించారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల సమాచారం అధికారులు చెప్పడం లేదని సమావేశం దృష్టికి తెచ్చారు. ఎంపీపీ ధనరాజు స్పందించి సభ్యులకు సమాచారం లేని పనుల గూర్చి ఈ సమావేశంలో వివరించవద్దన్నారు. ఎంపీడీవో ఎంపీడీవో ఆర్.లోహిత్ జయ సాగర్, ఎంపీపీలు శాఖల వారీగా సమీక్ష నిర్వహించి సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ బుస్రా, ఎంఈవో డి.మురళీ సత్యనారాయణ, జడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, వైస్ ఎంపీపీ శేషుకుమారి, డీఆర్‌పీ ప్రసంగిరాజు, డిప్యూటీ ఎంపీడీవో ఎస్‌వీవీ నరశింహమూర్తి, ఏవో వి.కృష్ణచంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



నోబుల్ టీచర్స్ కార్యవర్గం వివరాలను అందిస్తున్న జిల్లా కార్యదర్శి

ఉండి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడమే తమ సంఘం ధ్యేయమని నోబుల్ టీచర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సత్యనారాయణరాజు అన్నారు. బుధవారం నూతన కార్యవర్గం ఏర్పాటు చేసుకున్నారు. ఎంఈవో కార్యాలయంలో నోబుల్ టీచర్స్ కార్యవర్గం వివరాలను అందించారు. గౌరవ అధ్యక్షుడిగా జి.ఎలీషా, మండల అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీటీవీ. దినేష్ కుమార్, మహిళ కార్యదర్శిగా బిడిసి.కళావతి, తదితరులను ఎన్నుకున్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన ర్యాలీ



జువ్వలపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కాళ్ళ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలలో ప్రతి ఒక్కరి ఆర్థిక వివరాలు తెలుసుకునే మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆకివీడు డీసీ చైర్మన్ గోకరాజు వెంకట శివరామరాజు అన్నారు. 'మన డబ్బులు- మన లెక్కలు, 'ఈ- నారీ విధులు, బాధ్యతలపై జువ్వలపాలెంలో బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. సభ్యులు నెలవారీ లావాదేవీలు మొబైల్‌లో చూసుకునే వెసులుబాటు ఉండడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అదేవిధంగా ప్రతి 10 సంఘాలకు ఒక ఈ-నారీ ఎంపిక వల్ల కూడా లెక్కల్లో తేడాలుండవని వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు టి.గౌతమి, సీసీ జి.రాంబాబు, వీవోఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై రాజకీయ నేతలతో సమావేశం

కాళ్ళ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, డీటీ (ఎలక్షన్) టి.రత్నకుమార్ తెలిపారు. బుధవారం కాళ్ళ తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో ముసాయిదా జాబితాపై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, కలెక్టర్ ఆదేశాల మేరకు నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జి.స్వాతి, యాతం తేజ, మండలంలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లు..
అక్రమాలకు తలుపులు

జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు అభాసుపాలు చేస్తున్నాయి. ప్రజలకు సేవలు వేగంగా అందించడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అమలుచేస్తోంది. దీనిని అక్రమార్కులు తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారు. దానికి కొందరు సబ్ రిజిస్ట్రార్‌లు ఊత మిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారుల నుంచి సిఫార్సులు వెలుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బంది ఎనీవేర్ విధానంలో రిజిస్ట్రేషన్‌లు చేయడానికి ఇది కూడా కారణమవుతోంది. అవసరమైతే దస్తా వేజుల్లో సవరణలు చేస్తున్నారు. దస్తావేజులపై రిమార్క్‌లున్నా రిజిస్ట్రేషన్‌లు చేసి అడ్డంగా దొరికిపోతున్నారు.
(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- రిమార్కులున్నా రిజిస్ట్రేషన్లు
- ఉండిలో పనిచేసిన మహిళా సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్
- ఏసీబీ బెదిరింపులతో సొమ్ము ముట్టజెప్పిన సబ్ రిజిస్ట్రార్‌కు తాఖీదులు?



మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఉండిలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన మహిళా అధికారి, మరో సీనియర్ అసిస్టెంట్‌ను వారం క్రితం సస్పెండ్ చేశారు. సదరు అధికారిణి కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం బంటుమల్లి గ్రామానికి చెందిన స్థలానికి సంబంధించి ఉండిలో సవరణ రిజిస్ట్రేషన్ చేశారు. సర్వే నంబర్‌ను మార్చారు. దాంతో సదరు సర్వే నంబరు భూమి తమదంటూ యజమాని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రేషన్ కోసం అప్పటి జిల్లా రిజిస్ట్రార్ కూడా సిఫారసు చేశారు. దాంతో ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయ్యింది. జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అధికారుల సిఫారసుతో రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ సుధారాణి దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దీనిపై దర్యాప్తు జరుగుతోంది.

ఇదిలా ఉంటే జిల్లాకు చెందిన మరో నాలుగు స్థలాలను కూడా ఉండిలో రిజిస్ట్రేషన్ చేశారు. వాస్తవానికి సదరు స్థలాల దస్తావేజులపై ఇతర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిమార్క్‌లు రాశారు. అయినా సరే ఎనీవేర్ విధానంలో ఉండిలో రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. దాంతో రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ సుధారాణి, అప్పట్లో పనిచేసిన సీనియర్ అసిస్టెంట్‌ను రిజిస్ట్రేషన్ శాఖ సస్పెండ్ చేసింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మాయాజాలం ఈ ఒక్క సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికే పరిమితం కావడం లేదు. మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలోనూ కృష్ణా జిల్లా భూములు రిజిస్ట్రేషన్ చేశారు. దాంతో అక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారు. తదుపరి మరోచోట అతనికి పోస్టింగ్ ఇచ్చారు. ఇలా ఆన్‌లైన్ విధానాన్ని అక్ర మార్కులు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు.

మొగల్తూరులో ఏసీబీ పేరుతో మోసం

ఏసీబీ పేరుతో మోసానికి గురైన మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్‌కు ఇప్పుడు అదే శాఖ నుంచి తాఖీదులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. దాడులు చేస్తామంటూ బెదిరిస్తే సైబర్ నేరగాళ్లకు రూ2 లక్షలు చెల్లించేశారు. అంత మొత్తం సైబర్ నేరగాళ్ళకు ఇవ్వడంపై చర్చ జరుగుతోంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదా లు జరిగాయి. అక్రమాలు అధికంగా జరుగు తున్నాయంటూ ప్రభుత్వానికి సమాచారం వెళ్లిన నేపథ్యంలోనే అవినీతి నిరోధక శాఖ సోదాలు చేపట్టింది. జిల్లాలో ఏ ఒక్క సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ ఏసీబీ సోదాలు చేయక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోనూ ఏసీబీ సోదాలు చేయాలంటూ ప్రభుత్వం నుంచి సంకేతాలు వెళ్లినట్టు జిల్లా రిజిస్ట్రేషన్ సిబ్బందిలో చర్చ నడుస్తోంది. దాంతో ఏ క్షణంలో దాడులు జరుగుతాయోనని మల్లగుల్లాలు పడుతున్నారు. మరోవైపు సైబర్ నేరగాళ్లకు సొమ్ములు చెల్లించిన సబ్ రిజిస్ట్రార్‌కు నోటీసులు ఇవ్వడానికి రిజిస్ట్రేషన్ శాఖ సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి

యాంటీబయోటిక్స్ ఎక్కువ వాడొద్దు

డీఎంహెచ్‌వో గీతాబాయి అవగాహన

భీమవరంటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యాంటీ బయోటిక్స్ ఎక్కువగా వాడకూడదని, దానివల్ల దుష్ప్రభావాలు ఉంటాయని డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి అన్నారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల్లో బాగంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్స్ వాడకూడదన్నారు. ఎక్కువగా వాడటం వల్ల రోగం వచ్చినపుడు మందులు సరిగ్గా పనిచేయవని అన్నారు. రోగ నిరోధక శక్తి క్షీణించి తరచూ వ్యాదుల బారిన పడతామన్నారు. వీటి వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్లు ధనలక్ష్మి, భావన, గాతల సుబాష్, ఏవీవీ రాజా తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పై అవగాహన ఉండాలి

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్



ఏలూరుటూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై విద్యార్థులు అవ గాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాల యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అందరూ గౌరవిం చాలన్నారు. న్యాయవాది రత్నరాజు, సెట్‌వెల్ సీఈఓ ఎస్.ప్రభాకరరావు, మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రత్నాకరరావు, ఎంఎస్ కుమార్, నేతర అజయ్‌బాబు పాల్గొన్నారు.

● బాలల గ్రంథాలయంలో మహిళా సాధికారతపై చర్చ నిర్వహించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. గ్రంథపాలకురాలు ఎం.శోభ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వం, వేమన శతక పద్యాల పోటీలు నిర్వహించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కె.రమేశ్‌బాబు ప్రతిజ్ఞ చేయించారు.

● మహిళా గ్రంథాలయంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలల హక్కులు, బాల్యవివాహాలపై చైల్డ్ రైట్స్ అడ్వొకసి ఫౌండేషన్ నాయకులు ఎస్.రవిబాబు, ఆర్.వినోద్‌కుమార్, అవగాహన కల్పించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఉప్పులూరులో జ్వరాలు

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- యండగండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రెండోరోజు వైద్యశిబిరం

ఉండి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఉప్పులూరు గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. కొంతమంది గ్రామస్థులు జ్వరాలతో బాధపడుతూ సతమతమవుతున్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తమై చర్యలు చేపట్టింది. వైద్య అధికారులు రెండోరోజు గ్రామంలో పర్యటించి జ్వరంతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. యండగండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది ఈనెల 15వ తేదీ నుంచి గ్రామానికి విచ్చేసి సర్వేలు చేపట్టి వైద్యసేవలు అందిస్తున్నారు. మరికొంతమంది జ్వర బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. జ్వరం, ఒళ్లునొప్పులు, తలపోటు, నీరసం వంటివి వ్యాపించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పారిశుధ్యం గ్రామంలో సరిగా వుండడంలేదని, మంచినీటి సమస్య కూడా ఉందని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో చెత్తతోపాటు దోమలు ఎక్కువగా ఉన్నాయని, అయినప్పటికీ ఫాగింగ్ మిషన్ ఉపయోగించిన దాఖలు లేవని ప్రజలు వాపోతున్నారు. గ్రామ సర్పంచ్ యర్రా దుర్గారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు లోకం సుబ్బారావు ఐదు రోజుల నుంచి భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరి మెరుగైన వైద్యం పొంది కోలుకుని ఇంటికి చేరుకున్నారు.

అప్రమత్తమైన అధికారులు

గ్రామంలో అధికార యంత్రాంగం అప్రమత్తమై చర్యలు చేపట్టింది. రెండోరోజు జిల్లా మలేరియా అధికారి క్రాంతి, డాక్టర్ సుభాస్, సబ్ యూనిట్ అఫీసర్ ఏఎస్‌ఎస్‌ఎన్ మూర్తి, వైద్య అధికారి కీర్తన, ఎంపీడీవో శ్రీనివాస్, ఈవోపీ ఆర్‌డీ రెడ్డి విచ్చేసి వైద్య శిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. పలువురు బాధిత ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను, స్థానిక పరిస్థితులను పరిశీలించారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ కీర్తన

ఇంటింటికి జ్వరాల సర్వే

గ్రామంలో ఇంటింటికి జ్వరాలు సర్వేను ఏడు బృందాలతో చేపట్టారు. యండగండి పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ ముగ్గురూ ఒక టీం కింద ఏర్పాటు చేసి సర్వే చేయించారు. మంగళవారం 30 మంది శిబిరానికి విచ్చేసి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 8 మందికి జ్వరాలున్నట్లు గుర్తించారు. బుధవారం వైద్య శిబిరంనకు విచ్చేసిన 35 మందికి పరీక్షలు చేయగా, వారిలో పది మంది నమూనాలు తీసుకుని పరీక్షలు జరిపామని నార్మల్‌గానే వున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి మందులు అందించినట్లు తెలిపారు. యండగండి పీహెచ్‌సీ సీహెచ్‌వో వెంకటేశ్వరరావు, పీహెచ్‌ఎన్ దుర్గా కుమారి, ఎంపీహెచ్‌ఎస్ శ్రీనివాస్, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులు ఆందోళన చెందవద్దు



గ్రామస్థులు ఆందోళన చెందవద్దు. అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో వున్నాయి. వాతావరణ పరిస్థితులు మారడంతో చిన్నచిన్న సమస్యలు వస్తుంటాయి. జ్వరమే కదా అని నిర్లక్ష్యం చేయవద్దు. తక్షణమే వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలి.

– డాక్టర్ కీర్తన, ప్రాథమిక వైద్య అధికారిణి, యండగండి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌వర్మ ఠాకూర్

రాష్ట్రవ్యాప్తంగా గోశాలల నిర్మాణమే ధ్యేయం

- గోసేవా సంరక్షణ సంసథ్ సంస్థ

రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌వర్మ ఠాకూర్

గణపవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గోసంరక్షణను ఒక ఉద్యమంగా మారుస్తూ తొలివిడతలో 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గోశాలల నిర్మాణాన్ని ధ్యేయంగా పెట్టుకుని గోసేవా సంరక్షణ సంసథ్ కార్యకలాపాలు నిర్వహిస్తుందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌వర్మ ఠాకూర్ తెలిపారు. బుధవారం గణపవరంలో శ్రీలలిత పిరమిడ్ ధ్యానకేంద్ర ఆవరణలో ఏలూరు జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షుల నియామకం సందర్భంగా జిల్లా అధ్యక్షుడు షైలవరపు సురేంద్రకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన నియామక పత్రాలు అందించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గోశాలల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామని నిర్మాణమైన ప్రతీగోశాలకు రామదామం అని నామకరణం చేసి గోవుల సంరక్షణ, వాటి పర్యవేక్షణే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. గోశాలలకు రాష్ట్రప్రభుత్వ సహకారం, దాతల సహకారంతో గోవులను సేకరించి ఆయా ప్రాంత స్థితిగతులను బట్టి గోశాలల నిర్మాణం చేపడతామన్నారు. మాసవరం దాసాంజనేయస్వామి దేవాలయ చైర్మన్ చోడిశెట్టి కృష్ణప్రసాద్, కాకినాడ జిల్లా గోసేవా సంరక్షణ అధ్యక్షుడు రామకృష్ణ, స్థానిక లలిత పిరమిడ్ ధ్యాన కేంద్ర మాస్టర్లు పెరుమాళ్ల మురళీకృష్ణ, మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి'



పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన

పెదవేగి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): 'కాంట్రాక్టు కార్మికులకు రావాల్సిన సౌకర్యాలు, సదుపాయాలు అమలు చేసే విషయంలో సంబంధిత కాంట్రాక్టర్ పూర్తిగా విఫలమయ్యారని, కనీస వేతనాలు మినహాయించి, మిగిలిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని, పండుగ సెలవులు, ఓటీ, బోనస్ వంటి చట్టపరమైన సౌకర్యాలను కల్పించాలి' ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు డిమాండ్ చేశారు. కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఇఫ్టూ అనుబంధ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు పామాయిల్ ఫ్యాక్టరీ దగ్గర బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్యాక్టరీ సీనియర్ మేనేజర్ యు.సుధాకర్‌కు సమస్యలు విన్నవించారు. కాంట్రాక్టర్‌తో సంప్రదించి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన మేనేజర్ సుధాకర్ స్థానికంగా ఉన్న కాంట్రాక్టరుతో మాట్లాడి, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో యాజమాన్యానికి తెలియపర్చాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇఫ్టూ నాయకులు ముక్కు సుబ్బారావు, మానికొండ కాంతారావు, ప్రసాద్, తాతా నాగేశ్వరరావు, గొల్లపల్లి ఏసురత్నం, ఎన్.హరిబాబు, సంపంగి ప్రసాద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మరిన్ని వైద్య సేవలు : ఆరిమిల్లి

తణుకు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో కీళ్లు, వెన్నెముక వ్యాధులకు సంబంధించిన ఓపీ విభాగాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2024-19లో లయన్స్ సహకారంతో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఆసుపత్రికి రోజు 600మంది ఓపీకి వస్తున్నారని చెప్పారు. కంటి వ్యాధులకు సంబంధించి శస్త్రచికిత్సలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రైవేట్ వైద్యులతో ఎంవోయూ చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో వారి సేవలు వినియోగించుకుంటున్నామన్నారు. నిమ్మగడ్డ ఆసుపత్రి సహకారంతో డాక్టర్లు అచ్యుత రామయ్య, ప్రదీప్, నిహారిక, న్యూరో, కీళ్లు, వెన్నెముక వ్యాధులకు, యాపిల్ ఆసుపత్రి సహకారంతో కిడ్నీ సంబంధించి ఓపీలు ప్రారంభించామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ ప్రతి బుధ, శుక్రవారం అందుబాటులో ఉంటారన్నారు. కూటమి నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, వంటెద్దు రాజా, వైద్యులు పాల్గొన్నారు

గోదావరిలో జాహ్నవి మృతదేహం లభ్యం



జాహ్నవి (ఫైల్)

యలమంచిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన తండ్రి, కుమారుడు, కుమార్తె చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో కుమార్తె జాహ్నవి(11) మృతదేహం బుధవారం లభ్యమైంది. తండ్రి శిరిగినీడి దుర్గాప్రసాద్ (43), కుమారుడు మోహిత్(14) మృతదేహాలు మంగళ వారం లభ్యమైన విషయం విదితమే. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు యలమంచిలి ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. లక్కవరంలో విషాదఛాయలు అలముకున్నాయి.

విద్యుదాఘాతంతో ఉద్యోగి మృతి



మృతుడు రమేష్

ఏలూరు క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రపరుస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగి డ్రైవర్‌పై పడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు చాణక్యపురి కాలనీలో నివాసం ఉంటున్న రమేష్ (32)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్‌పై ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏలూరు అశోక్‌నగర్ బ్రిడ్జి వద్ద శ్మశాన వాటికను శుభ్రపరుస్తుండగా ఎక్స్‌కవేటర్ నడుపుతున్న రమేష్‌పై ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగి పడడంతో అతను విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు నగరపాలక కమిషనర్ భానుప్రతాప్ మృతదేహాన్ని పరిశీలించి మృతుని కుటుంబీకులను పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బి. సోమయ్య, బద్దా వెంకటరావు, జి వెంకటేశ్వరరావు, రత్నబాబు, కె. విజయలక్ష్మి, పంతగాని రాజేష్, పెద్దిరాజు తదితరులు రమేష్ మృత దేహాన్ని సందర్శించారు. రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని ఆయన భార్యకు ఉద్యోగం ఇవ్వాలని మునిసిపల్ అధికారులను డిమాండ్ చేశారు.

వ్యక్తిగత కక్షతో హత్యాయత్నం

భీమడోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షతో భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన నిటా నాగరాజుపై నలుగురు దాడి చేశారు. ఈ నెల 18వ తేదీన అదే గ్రామానికి చెందిన గొల్ల గౌతమ్, కాళీ రాజకుమార్, బొంతు శివకుమార్, సిరికోట నరేంద్రవర్మ నాగరాజుపై దాడి చేసి బీరుసీసా పగులగొట్టి పొడిచినట్లు పోలీసులు తెలిపారు. నాగరాజును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

ఆకివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిందితుడికి భీమవరం కోర్టు ఆరు నెలలు జైలు, రూ.2 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ హనుమంతు నాగరాజు బుధవారం తెలిపారు. సిద్ధాపురానికి చెందిన కలిదిండి సత్యనారాయణరాజు 2021 డిసెంబరు 10న వ్యవసాయ పని నిమిత్తం కళింగగూడెం వెళ్ళి తిరిగి వస్తుండగా మద్యం షాపు దగ్గర లారీ డ్రైవర్ బీవీవీ సత్యనారాయణ అతివేగంగా ఢీకొట్టడంతో సత్యనారాయణరాజు అక్కడకక్కడే మృతి చెందాడు. అప్పటి ఎస్ఐ వై.కిరణ్ కుమార్ కేసు నమోదు చేశారు. బుధవారం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సురేష్‌బాబు ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

బంగారం స్వాధీనం

భీమవరం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణానికి చెందిన వ్యక్తి ఈ నెల 17న ఆర్టీసీ బస్టాండ్‌లో బస్ ఎక్కుతుండగా అతని వ్యక్తి సంచిలో ఉన్న రూ. 15 లక్షల విలువ గల బంగారు నగలను తోటి ప్రయాణికుడిలా తోసుకుంటూ వచ్చి బస్ ఎక్కుతున్నట్లు నటించి నగల సంచిని ఆగంతుకుడు అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని బంగారం స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.



పాలకొల్లులో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల నివాళులు

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

భీమవరంటౌన్/పాలకొల్లు అర్బన్,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం భీమవరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటా నికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికు మార్‌రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారామ్ తదితరులు పూల మాల వేసి నివాళులర్పించారు..

పాలకొల్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

పాలకొల్లు పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ బొమ్మల సెంటర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు గోగుల మండ భాస్కరరావు, యలమర్తి మోహనరావు, ముడకల గోపాలరావు, షేక్ మహబూబ్ జానీ, ఖండవల్లి ప్రభుదాసు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం

భీమవరం పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ గ్రంథాలయంలో బుధవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. సమాజంలో ఉత్తమ సేవలందిస్తున్న మహిళలను సత్కరించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉమెన్స్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి విచ్చేసి ఇందిరాగాంధీ, ఝాన్సీలక్ష్మీ బాయి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో పలు సంస్థలు, సంఘాల ద్వారా సేవలందిస్తున్న మహిళామణులు జిల్లా ఉమెన్స్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి, చేకూరి ఝాన్సీలక్ష్మి, గంధం శ్రీదేవి, సుభద్రాదేవి, దయా ప్యారీ, రూపవాణి, మునగా శాంతిలక్ష్మి, ఇమ్మడి రమ్య, ఎం.కౌసర్, మహమ్మద్ సరోజిని, పుష్పలను సత్కరించారు.



మహిళలను సత్కరించిన దృశ్యం

గరికతో అర్చన.. బెల్లంతో నివేదనలు

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : కార్తీకంలోని ఆఖరు రోజు కావడం బుధవారం సత్రంపాడులోని లక్ష్మీగణపతిస్వామి ఆలయం వద్ద భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని గరికతో అర్చనలు జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. ఆలయ అర్చకులు రెండుచింతల రామవేంద్రశర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. స్వామి వారి సన్నిధిలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావులు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

టి.నరసాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని టినరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎల్.రాజకుమార్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, మెట్టగూడెం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు టి.పూర్ణచంద్రరావు, గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, ఉపాధ్యాయిని కె.మహాలక్ష్మి పాల్గొన్నారు.


రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి


సీఎం ప్రత్యక్ష ప్రచారం చూస్తున్న బొరగం


రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

అన్నదాత సంక్షేమమే లక్ష్యం

రైతుల ఖాతాల్లో నగదు జమ - సర్వత్రా వ్యక్తమవుతున్న ఆనందం

ఏలూరుటూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. సూపర్ సిక్స్, ఇతర హామీల్లో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ ఒక్క హామీ నెరవేరుస్తున్నామన్నారు. రెండవ విడతగా రూ. 7వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అర్హత ఉన్న ప్రతీ రైతు ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు.

● దెందులూరు: అన్నదాత అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం నియోజకవర్గ ముఖ్య కేంద్రం దెందులూరులోని వీర మాచినేని పుష్ప కల్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండవ విడత నిధులు బుధవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా విడుదల చేశారు. దెందులూరు నియోజకవ ర్గంలో 19,950 మంది రైతులకు ఒక్కో రైతుకు రూ.7వేల చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమ చేశారు. నియోజకవర్గ పరిశీలకులు గాంధీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ కిషోర్, వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల వెంకట లక్ష్మి, దెందులూరు బ్యాంకు అధ్యక్షులు గారపాటి కొండయ్య చౌదరి, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, మోతుకూరి నాని బాబు, బొప్పన సుధా, వ్యవసాయ శాఖ, ఏడీ అనిల్ కుమారి, ఎల్.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో సమీక్ష

సచివాలయాలకు రావడం కూర్చోవడం మధ్యాహ్నం నుంచి వెళ్లి పోవడం చాలా మంది ఉద్యోగులు చేస్తున్నారని, అలాంటి వాళ్లు తమకు వద్దని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భీమరాజు, ప్రత్యేక అధికారి విజయరాజులతో కలిసి నియోజకవర్గ స్థాయిలో అన్ని సచివాలయ ఉద్యోగులతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పరిరక్షణ పచ్చదనంపై ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై శ్రద్ధ పెట్టాలన్నారు. తహసీల్దార్ సుమతి పాల్గొన్నారు.

● పోలవరం: రైతుల ఖాతాలకు నేరుగా నిధులు జమ చేయడం హర్షనీయమని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. బుధవారం పోలవరం మండలం కొత్తపట్టిసీమ రైతు సేవా కేంద్రంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ప్రజలకు అందించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకాల సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా బొరగం మాట్లాడుతూ దళారీల నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజలు హర్షించేలా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో 34,037 మంది రైతులకు రూ.22 కోట్ల 60 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు. మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు, కూటమి నేతలు నల్లా రాంబాబు, నునకాని రాంబాబు పాల్గొన్నారు.

● చింతలపూడి: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లోకి 24 గంటల్లోనే జమవుతుందన్నారు. అన్నదాత సుఖీభవ రెండో విడతలో నియోజకవర్గంలో 36 వేల 818 మంది రైతులకు రూ.24 కోట్ల 26 లక్షల చెక్కును రైతులకు అందజేశారు. ఏఎంసీ అధ్యక్షురాలు చీదరాల దుర్గాపార్వతి, ఏఎంసీ మాజీ అధ్యక్షులు జె. ముత్తారెడ్డి, జనసేన నాయకులు చీదరాల మధుబాబు, జిల్లా రైతు టీడీపీ అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు, టి.అప్పారావు, విజయకుమారి, వ్యవసాయ శాఖ ఎడి సుబ్బారావు, ఏవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. అన్నదాత సుఖిభవ, పీఎం కిసాన్‌లో భాగంగా రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానం మేరకు ఒక్కో రైతు ఖాతాలో రూ.7వేలు నగదు జమ చేశామన్నారు. దేశంలోనే రైతుల ఖాతాలో నగదు చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వం ఏపీ ప్రభుత్వమన్నారు. ఏఎంసీ చైర్మన్ పార్థసారధి, ఇడా చైర్మన్ శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వాణిశ్రీ, జనసేన జిల్లా కార్యదర్శి కే.సాయి తేజస్విని, బొద్దాని శ్రీనివాస్, గౌరీశంకర్, జ్యోతికుమార్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేడు ఆయిల్ పామ్ రైతుల సమావేశం

ద్వారకాతిరుమల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం ద్వారకాతిరుమల విశాల సహకార సంఘ ఆవరణలో పామాయిల్ రైతులకు అవగాహన కార్యక్రమం జరుగుతుందని సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు(పీఎస్ఆర్) తెలిపారు. బుధవారం జరగాల్సిన ఈ సమావేశం అని వార్యకారణాల వల్ల గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు కు వాయిదా పడిందన్నారు. సంఘ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి నాబార్డ్ డీడీఎం టి.అనిల్‌కాంత్, ఏలూరు డీసీసీబీ డీపీడీఎంలు సాయికిరణ్, రమేష్, గోద్రేజ్ ఆయిల్‌పాం ఫ్యాక్టరీ అధికారులు, మండల అధికారులు విచ్చేస్తారని రైతు సోదరులు విధిగా హాజరై విజయవంతం చేయాలని పీఎస్ఆర్ కోరారు.

రెండు రోజుల జాతీయ గణిత వర్కుషాపు ప్రారంభం



ఏలూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గణితశాస్త్రాలు, సాంకేతికతలో ఉద్భవిస్తున్న ధోరణులు అనే అంశంపై రెండు రోజుల జాతీయస్థాయి గణిత వర్కుషాప్ బుధవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో ప్రారంభమైంది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేథమెటికల్ సైన్స్ ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ క్రిప్టోగ్రఫీలో నంబర్ థియరీ లోతైన పాత్రపై వివరించారు. సమకాలీన ఎన్క్రిప్షన్ టెక్నాలజీకి పురాతన గణిత శాస్త్ర పునాది గురించి ఉపన్యసించారు. డిజిటల్ గుర్తింపు, ఆన్‌లైన్‌లో లావాదేవీలకు భద్రత, సురక్షిత కమ్యూనికేషన్ల డేటా ప్రాధాన్యత, ప్రామాణికత, ఉపయోగాలను వివరించారు. ఢిల్లీలోని శివ నాడార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియంక గ్రోవర్ మాట్లా డుతూ ఫంక్షనల్ విశ్లేషణ, ఆప్టమైజేషన్ సిద్ధాంతం మధ్య చర్యలగురించి విశ్లేషించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, ప్రొఫెసర్ ఆర్కే రావు, మ్యాథ్స్ హెచ్‌వోడి గోపీనాథ్, కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

కామవరపుకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కామవరపుకోటలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. రోడ్డు ట్రాఫిక్‌ను నియంత్రించాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని, తుఫాను సందర్భంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి నాయక్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు.న్యూడెమోక్రసి నాయకులు తలారి ప్రకాష్, బోడ యేసుపాదం, పోలిమెట్ల రమేష్, తాళం సత్యనారాయణ పాల్గొన్నారు.

పీటర్ డ్రక్కర్ సూత్రాలు వ్యాపారాలకు దోహదం



పెదపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆధునిక నిర్వహణ శాస్త్ర పితామహుడు పీటర్ ఎఫ్. డ్రక్కర్ ఆధునిక సంస్థాగత వ్యవస్థలపై చూపిన ప్రభావం, ఆయన సిద్ధాంతాలు నేటి వ్యాపార ప్రపంచానికి మార్గదర్శకాలని చెన్నైకి చెందిన లీడ్వే రిసోర్స్ లీడ్ టాలెంట్ అక్విజిషన్ స్పెషలిస్ట్ కె.సంజనా తెలిపారు. వట్లూరులోని సర్‌సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో పీటర్ డ్రక్కర్ 116 జయంతిని బుధవారం నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థి సంజనా ముఖ్య అతిథి పీటర్ డ్రక్కర్ గురించి మాట్లాడుతూ డ్రక్కర్ సూచనలు ఎంతో విలువలతో ఉన్నాయన్నారు. కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, కె.హరిరామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, ఎంబీఏ హెచ్‌వోడీ డాక్టరు కేవీ శ్రీధర్, శ్రీలాస్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం :దాసరి శేషు

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, జడ్పీటీసీ సభ్యులు పోల్నాటి బాబ్జి అన్నారు. బుధవారం మండలంలోని శ్రీనివాసపురం రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమంలో భాగంగా చెక్కులు పంపిణీ చేశారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, కూటమి నాయకులు రాగాని శ్రీను, తడికల దావీదు, రాగాని రామకృష్ణ, తాళ్లూరి వెంకటేశ్వరరావు, తన్నీరు రామకృష్ణ, కేదాసు శ్రీను, తన్నీరు వెంకటేశ్వరరావు, వీరమల్ల పోసుబాబు, చెల్లారావు, వ్యవసాయ సహాయకుడు మాధవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరా జయంతి



ఏలూరుకార్పొరేషన్/ జంగారెడ్డిగూడెం/ కామవరపుకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు చెక్కా గుప్తా, లంకా రామ్మోహన్, గౌడు రంగబాబు, పి.చంద్రశేఖర్, ఎస్.బాబ్రుప్రసాద్, డిసిఓ సుబ్బారావు, మూర్తి పాల్గొ న్నారు. జంగారెడ్డిగూడెంలోని శాఖా గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతిని నిర్వ హించారు. గ్రంథాలయ చైర్మన్ కొప్పాక శ్రీనివాసరావు ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కామవరపుకోట శాఖా గ్రంథాల యంలో ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. తోకల రమేష్, డైరెక్టర్ జగన్, సౌజన్య, రాము, దివ్య, గౌతమి, రాజీవ్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ ఇబ్రహీం, సీపీఐ నాయకులు టి.వి.ఎస్.రాజు, గ్రంథ పాలకులు అరుణకుమార్ పాల్గొన్నారు.

క్షణ క్షణం.. ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

మినహా మిగిలిన వారికి తెలుగు రాక పోవడంతో కుక్కునూరు ప్రాంతం నుంచి తీసుకొచ్చిన ఇద్దరు యువకులు మేజిస్ట్రేట్‌కు, మావోయిస్టులకు వారధులుగా గోండు భాషను తర్జుమా చేసి తెలుగులో మేజిస్ట్రేట్ ఎన్.మేరీకి వివరించారు. మేజిస్ట్రేట్ అడిగిన ప్రశ్నలను భాషను తర్జుమా చేసి మావో యిస్టులకు తెలిపి వారి సమాధానాన్ని తిరిగి వివరించారు. తండ్రి పేరు, ఊరు పేరు, ప్రాంతం వివరాలను అడిగారు. పోలీసులు అరెస్టు చేసినట్టు వారి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారా.. అని అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ఇబ్బంది పెట్టారా, శరీరంపై ఏమైనా గాయాలున్నాయా అని ప్రశ్నించారు. ఎన్ని గంటలకు అరెస్టు చేశారు వంటి ప్రశ్నలను అడిగి వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఒక్కొక్కరిని విడివిడిగా కోర్టులో హాజరు పరిచారు. వారికి ఆధార్ కార్డులు, ఇతర వివరాలు ఉండాలని మేజిస్ట్రేట్ పోలీసులకు సూచించడంతో వారు అడవుల్లో ఉంటారని వారికి ఎలాంటి ఆధార్ కార్డులు ఉండవని, అరెస్టు చేసేటప్పుడు మధ్యవర్తులతో నిర్వహించిన పంచనామా రిపోర్టులో పేర్కొనడంతో మేజిస్ట్రేట్ సంతృప్తి వ్యక్తం చేస్తూ 15 మంది మావోయిస్టులకు వచ్చేనెల 3వ తేదీ వరకు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించడానికి ఆదేశాలు జారీ చేశారు.

సెంట్రల్ జైలుకు తరలింపు : ప్రత్యేక పోలీసు బలగాల మధ్య రాత్రి ఏడు గంటలకు ఏలూరు నుంచి రాజమండ్రి సెంట్రల్ జైలుకు మావోయిస్టులను తరలించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ స్వయంగా మహిళా పోలీస్‌స్టేషన్ భవనానికి వచ్చి మావోయిస్టులను కోర్టుకు తరలించేటప్పుడు ఆయనే స్వయంగా పరిశీలించారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, భీమడోలు సీఐ యూజేవిల్సన్, జంగారెడ్డిగూడెం సీఐ ఎంవీ సుభాష్, ఏలూరు రూరల్ ఎస్ఐ బి.నాగబాబు, నగరంలోని పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసుల పటిష్ట బందోబస్తు మధ్య వారిని కోర్టుకు హాజరుపరిచారు. 15 మంది మావోయిస్టులపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 330/2025 అండర్ సెక్షన్ 147, 148, 149, 189 (2)(4) రెడ్‌విత్ 61(2) బీఎన్ఎస్ యాక్టు, 13-18-20-21-38 అండ్ ఉప 25(1ఎ ఆమ్స్ యాక్టు) కింద కేసు నమోదు చేశారు.

ముందుగానే అప్రమత్తం

(5వ పేజీ తరువాయి)

తీరానికి చేరుకుని నది దాటి వచ్చి ఉంటారన్న కోణంలోను దర్యాప్తు చేస్తున్నారు. నదిలో చేపల వేట సాగించే జాలర్లను అప్రమత్తం చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై సమాచారం అందించాలని కోరారు. కూనవరం, రుద్రమ్మకోట, పడవరేవు మీదుగా మావోయిస్టులు జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలు ఉండడంతో వేలేరుపాడు ఎస్ఐ నవీన్‌కుమార్ పోలీస్ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. మావోయిస్టుల కదలికలపై ఎస్ఐను వివరణ కోరగా 'ప్రస్తుతం మండలంలో మావోయిస్టుల కదలికలపై ఎలాంటి సమాచారం లేదు. ఉన్నతాధికారుల సూచనలతో తనిఖీలు చేపడుతున్నాం' అని తెలిపారు.


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

విద్యార్థినికి ఎమ్మెల్యే రోషన్ అభినందన

లింగపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి చింతలపూడి నియోజకవర్గం తరపున ఎన్నికైన రంగాపురం ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ చదువుతున్న లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని కె. వంశీకను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అభినందించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. లింగపాలెం ఎంఈవోలు దుర్గారావు, రవీంద్ర, ప్రధానోపాధ్యాయుడు వెంకటరత్నం, సర్పంచ్ నత్తా దివ్యదీప్తి పాల్గొన్నారు.

'వారిని కోర్టులో హాజరు పరచాలి'

బుట్టాయగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అరెస్టు చేసిన మావోయిస్టులను వెంటనే కోర్టులో హాజరుపరచాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కె.వి.రమణ డిమాండ్ చేశారు. బుధవారం బుట్టాయగూడెం రామనర్సయ్య భవనంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు అరెస్టు చేసిన మావోయిస్టులను, సానుభూతిపరులను పోలీసులు అరెస్టులు చేశారని వారిని వెంటనే కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన రెండు ఎన్‌కౌంటర్లు అనుమానాస్పదంగా ఉన్నాయని వాటిపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని కోరారు. ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు కారం రాఘవ, ఈ.భూషణం, బి.వినోద్, టి.బాబూరావు, కట్టం నాగేశ్వరరావు, సర్పంచ్ కారం లక్ష్మీఉప సర్పంచ్ చింతల కన్న, భాషా శ్యాంబాబు, రామలక్ష్మి ఉన్నారు.

ముగిసిన కార్తీక పూజలు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలోని ఆఖరు రోజు కావడంతో బుధవారం నగరంలోని శివాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సత్రంపాడులోని అంబికా దేవి ఆలయ ప్రాంగణంలోని అంబికేశ్వర స్వామికి ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి భక్తజనానికి దర్శనమిచ్చారు. సత్యనారాయణ పేటలోని గంగా పార్వతీ సమేత రేవులింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు వీరుబొట్ల వెంకటేశ్వర శర్మ, యాజ్ఞిక బ్రహ్మ వీరుబొట్ల కృష్ణశర్మలు అర్చనలు జరిపారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

లింగపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మండలంలోని గ్రంథాలయాధికారులు జి.హెచ్.వెంకట రమణ, లతీఫ్‌ల ఆధ్వర్యంలో ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రంథాలయాల్లో విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకత, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

లింగపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. అరెస్టు చేసిన వారి నుంచి రూ.5,450 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.ఈ దాడుల్లో ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

కోడి పందేల దాడిలో 8మంది అరెస్టు

జీలుగుమిల్లి: కోడి పందేల స్థావరంపై ఎస్.ఐ వి.క్రాంతి కుమార్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ క్రమంలో ములగలంపల్లి గ్రామ శివారులో బుధవారం పందెలు నిర్వహిస్తున్న 8 మందితో పాటు రెండు కోళ్లు, రూ.10,020 నగదు స్వాధీనం చేసుకున్నారు.


మహిళలను సత్కరించిన దృశ్యం

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

ద్వారకాతిరుమల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు దిశ చట్టంపై అవగాహన కల్పించారు.అనంతరం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని పలువురు మహిళా టీచర్లు, పోలీస్ కమల కుమారిని సత్కరించారు.ముందుగా ఇందిర ఫొటోకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి ఎస్.సి.హెచ్.రామకృష్ణ పాల్గొన్నారు.

వసతి గృహానికి భవనం నిర్మించండి

బుట్టాయగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కూలడానికి సిద్ధంగా ఉన్న గిరిజన బాలుర కళాశాల భవనానికి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతూ బుధవారం కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్‌కు పీడీఎస్‌యూ నాయకులు ఈ.భూషణం, బి.వినోద్ వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎస్టీ హాస్టల్ భవనాన్ని 50 ఏళ్ల క్రితం నిర్మించారని ప్రస్తుతం శిథిలావస్థకు చేరినట్టు తెలిపారు. భోజనం చేయడానికి డైనింగ్ హాలు లేదని, పెచ్చులూడుతున్న భవనంలో విద్యార్థులు భయాందోళనలలో ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలకు నూతన భవనాలు నిర్మించాలన్నారు.


పారిశ్రామికవేత్తలను సత్కరిస్తున్న దృశ్యం

మహిళా పారిశ్రామికవేత్తల దినోత్సవం

ఏలూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళా పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని బుధవారం స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించారు. ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్ పర్సన్ రాధిక మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో వచ్చే చిన్న ఆలోచనలనే చిరు వ్యాపారాలుగా మలచుకోవచ్చన్నారు. దీనికి కావలసిన శిక్షణను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. అపర్ణ జూట్ క్రియేషన్స్ అధినేత అపర్ణ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, నమ్మకం, నిర్దిష్టమైన ప్రణాళిక ఉంటే రాణించవచ్చన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు బ్యాంకుల ద్వారా లభించే రుణాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి వివరించారు. కళాశాల పీజీ ఫిజిక్సు విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కరస్పాండెంట్లు డాక్టర్ విష్ణు మోహన్, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు, డైరెక్టర్ బాబు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

మహిళా సాధికారితపై చర్చ

పెదపాడు: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదపాడు శాఖా గ్రంథాలయంలో మహిళా సాధికారిత అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని పెదపాడు జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. మహిళలు కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జూనియర్ లెక్చరర్ కె.సుమతి తెలిపారు. గ్రంథాలయాధికారి జాన్‌బాబు పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన

చింతలపూడి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో దిశ చట్టంపై అవగాహన కల్పించారు. ఏఎంసీ చైర్మన్ సి.హెచ్.దుర్గాపార్వతి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి ఎస్.వర్మ పాల్గొన్నారు.


ప్రశంసా పత్రాలు అందుకున్న విజేతలు

నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

పెదపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి, ఎం.డి. కె.సాయి రోహిత్ తెలిపారు. కళాశాలలో మేనేజ్‌మెంట్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వివిధ జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల నుంచి ఎంబీఏ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొనగా, ఎం.డి. సాయిరోహిత్ మాట్లాడుతూ వ్యక్తిత్వ లక్షణాలను మెరుగుపర్చుకోవడంతో పాటుగా సమూహాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే సమర్థత, లక్ష్యాలను అధిరోహించే ప్రణాళికలను నిరంతరం మెరుగుపర్చుకోవాలన్నారు. మేనేజ్‌మెంట్ గేమ్స్, గ్రూప్ డిస్కషన్, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.మురళీధరరావు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని కుమారుడు అదృశ్యం

పెదపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని తన కుమారుడు కనిపించడం లేదంటూ జంగారెడ్డిగూడేనికి చెందిన పిడుగు నాగలక్ష్మి పెదపాడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వికాస్(30)కు చిన్నతనం నుంచే మతిస్థిమితం లేక సరిగా మాట్లాడలేదు. కొన్ని రోజులుగా వికాస్‌కు ఆరోగ్యం బాగోకపోవడంతో పెదపాడు మండలం తాళ్లమూడిలోని ఆశాజ్యోతి మానసిక వికలాంగుల పాఠశాలలో చేర్పేందుకు సెప్టెంబరు 4న తీసుకెళ్లగా అక్కడి నుంచి పారిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లి నాగలక్ష్మి ఫిర్యాదుతో పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దీక్షలు చేపట్టిన రైతులు

సీడ్ ఆర్గనైజర్ నుంచి బకాయిలిప్పించండి

ద్వారకాతిరుమల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ నుంచి విత్తన బకాయిలు ఇప్పించాలని కోరుతూ మండలంలోని హనుమాన్ గూడెంలో బాధిత రైతులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సీడ్ ఆర్గనైజర్ చిలకా అప్పారావు ఇంటి ముందు మోసపోయిన రైతులు రిలే దీక్షలు చేపట్టారు. రైతు సంఘం నేత కట్టా భాస్కరరావు మాట్లాడుతూ మండలంలోని పంగిడిగూడెం శివారు హనుమాన్ గూడెంలో సీడ్ ఆర్గనైజర్ చేతిలో మోసపోయిన రైతులకు అధికారులు న్యాయం చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

నిత్య భిక్ష దాతకు ఘన సన్మానం

కామవరపుకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వీరభద్ర స్వామి ఆలయంలో స్వాములకు నిర్వ హిస్తున్న నిత్య భిక్ష బుధవారంతో ముగిసింది. కమిటీ నాయకులు దాతలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.జయవరపు లక్ష్మణరావు, చిలుకూరి ధనుంజయ, ఘంటా కిషోర్, కూటమి నాయకులు మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, కడిపి పాపారావు, మారం రమేష్, నందూరి ప్రభాకర్, కొండూరి శ్రీధర్, కానూరి సతీశ్, ఎం.కృష్ణమూర్తి, వి.వాసుబాబు పాల్గొన్నారు.


దాతను సన్మానిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వార్షిక మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెలగపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం డివిజనల్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పచ్చదనంపై దృష్టి సారించాలి

బుట్టాయగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతలపై దృష్టి సారించాలని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజులపాటు క్లీన్ అండ్ గ్రీన్ విలేజిలపై జరుగుతున్న శిక్షణ తరగతుల్లో బుధవారం ఆమె పాల్గొని మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాదులు దరిచేర వన్నారు. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు కార్యదర్శులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో జి.మణికుమారి తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణలో ఆమె మాట్లాడారు. డిప్యూటీ ఎంపీడీవో జె.వి.రమణమ్మ, టీవోటీలు నాగలక్ష్మి, శ్రీ హరి పాల్గొన్నారు.

● నిడమర్రు: ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలో పచ్చదనం, పరిశుభ్రత కు ప్రాధన్యం ఇవ్వాలని ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. బుధవారం నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, పంచాయితీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణను ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమంలో పరిశుభ్రతా చర్యల గురించి వివరించారు. గ్రామ సర్పంచ్‌లు పాలా వెంకటేశ్వరరావు, కిలారి సత్యవతిరవిబాబు, ఆదిరెడ్డి సత్యవతి, ముగ్గళ్ల యాకోబు పాల్గొన్నారు.

పాడి రైతులకు సూచనలు

పోలవరం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం రేపల్లెవాడ గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. తాడేపల్లి పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు డాక్టర్ మంత్రు నాయక్ ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న పాడి రైతులకు పోలవరం పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ జె.వి.రమణయ్య, రేపల్లెవాడ ఇంచార్జి పశువైద్యాధికారి శ్రీనివాస్ సూచనలు చేశారు. ఈ శిబిరంలో పశు వైద్య సిబ్బంది రేలంగి శివానందం, కొండలరావు, వెంకటరెడ్డి, అనంతలక్ష్మి, రైతుసేవా సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

చింతలపూడి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న టెన్త్ పరీక్షా కేంద్రాలను మండలంలో పరిశీలించడానికి పరీక్షల నిర్వహణ అసిస్టెంట్ కమిషనర్ ఆశ పరిశీలించారు. నగర పంచాయతీలోని ఐదు కేంద్రాలను, ప్రగడవరంలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీఈవో సుధాకర్, ఎంఈవో కిరణ్ బాబు, హెచ్ఎం చక్రధరరావు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

చింతలపూడి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు రుణాలు పొంది సకాలంలో చెల్లిస్తే తిరిగి ఇవ్వడానికి అవకాశం ఉంటుందని యర్రంపల్లి సొసైటీ చైర్‌పర్సన్ టి.చంద్రశేఖరరెడ్డి అన్నారు. బుధవారం సొసైటీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది 23 మందికి రూ.కోటి 6 లక్షల 70 వేలు రుణాలు, పంట రుణాల కింద 18 మందికి 30 లక్షల 55 వేలు అందించినట్టు చెప్పారు. సొసైటీల్లో కూడా డిపాజిట్లు చేస్తే వాణిజ్య బ్యాంకుల కంటే అదనపు వడ్డీ ఇస్తారని అన్నారు.


ప్లాంట్ ప్రారంభిస్తున్న దాతలు

వాటర్ ప్లాంట్ బహూకరణ

నిడమర్రు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అడవికొలను మోడల్ ప్రైమరీ పాఠశాలకు వాటర్ ప్లాంట్ బహూకరించారు. విర్‌బేక్ ఆక్వా మెడిసన్ కంపెనీ సుమారు రూ.40 వేల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ పాలా వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పైడికొండల శివాజీ, విర్‌బేక్ ఆక్వా మెడిసన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్న రోడ్డును తవ్వేశారు..

జంగారెడ్డిగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వ వార్డులోని టీచర్స్ కాలనీలో ఉన్న రోడ్డును తవ్వేసి ఇసుక గుట్టలు పోయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆ ప్రాంత ప్రజలు బుధవారం రోడ్డు వద్ద ఆందోళన చేపట్టారు. ఆ రోడ్డు నిర్మాణం పేరుతో ఆ ప్రాంత ప్రజలు నడవకుండా వేసిన ఇసుకను వెంటనే తొలగించాలని కోరుతున్నారు. మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. బిల్లులు పడలేదని, అందుకే పనులు నిలిపివేసినట్టు కాంట్రాక్టరు చెబుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు ఎం.వి.శ్యాంబాబు, ఎం.ప్రసాదరావు కోరుతున్నారు.


ఇసుక గుట్టలు చూపుతున్న స్థానికులు

ధూమపానానికి దూరంగా ఉండాలి

మండవల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని మండవల్లి జడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. డాన్ బాస్కో నవజీవన్ బాలభవన్ విజయవాడ స్వచ్ఛంద సంస్థ మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై మండవల్లి, భైరవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సర్పంచ్ మొండా రూస్సీ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఆగిరిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు దుకాణాల బయట కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ కె. శుభశేఖర్ సూచించారు. బుధవారం ఆగిరిపల్లి ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద ఉన్న దుకాణదారులతో మాట్లాడుతూ సీసీ కెమెరాలతో రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు, చోరీల సమయంలో నిందితులను సులువుగా పట్టుకోవచ్చని వివరించారు.



జాతీయ స్విమ్మింగ్ పోటీలకు కేకేఆర్ విద్యార్థులు

ఆగిరిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చొప్పరమెట్లలోని డాక్టర్ కేకేఆర్ హ్యాపీవ్యాలీ పాఠశాల విద్యార్థులు స్విమ్మింగ్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చైర్మన్ కోటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 6న విశాఖలో యుఎస్‌ఎఫ్‌ఐ (అండర్ వాటర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నిర్వహించిన అండర్-14 విభాగంలో డి. గౌతమ్‌కృష్ణ, హరిరుద్ర, కార్తికేయ, మోక్షకరన్, రుద్వేద్ జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్ర అంతర్ జిల్లాల తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో పాఠశాలకు చెందిన డి శ్రీకాంత్ 57 కిలోలు, జే సందీప్ రెడ్డి 61 కిలోల కేటగిరిలో విజయం సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు.





క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

కృష్ణా జిల్లా క్రికెట్ జట్టుకు ఆర్కిడ్ విద్యార్థులు

నూజివీడు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ అండర్-17 క్రికెట్ జట్టుకు నూజివీడు ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మొక్కపాటి రుక్మిణి తెలిపారు. కుంచనపల్లిలో జరిగిన బాలికల క్రికెట్ సెలక్షన్స్‌లో ఆరవ తరగతి చదువుతున్న బొట్ల సహస్రా మాల్యా ద్రి ఆల్ రౌండర్‌గాను, 8వ తరగతి చదువుతున్న కోట అక్షయ బ్యాట్ ఉమెన్‌గాను కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ మేడా మోహనరావు, డైరెక్టర్లు డా.గొల్లపూడి రవిబాబు, మేడ శ్రీహర్ష అభినందించారు.



మాట్లాడుతున్న రవికుమార్

వ్యవసాయాభివృద్ధిలో 'సహకార' పాత్ర కీలకం

చాట్రాయి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకమని, వీటి బలోపేతానికి రైతులు సహక రించాలని నూజివీడు డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి ఎం. రవికుమార్ కోరారు. 72వ అఖిల భారత సహకార వారోత్స వాలలో భాగంగా బుధవారం చాట్రాయి పీఏసీఎస్‌లో సహకార పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వాలు వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్ద ఎత్తున రుణాలు ఇస్తున్నాయని, ఇందులో సహకార రంగం వాటా గణనీయంగా పెరిగిందని అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ తుమ్మల రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సహకార అధికారులు వేణుగోపాలరెడ్డి, సాల్మన్‌రాజు, సీఈవో శ్రీనివాసరావు, జనసేన నాయకులు తుమ్మల జగన్, కరుణాకర్, చెన్నారావు, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

క్షణ క్షణం.. ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

మినహా మిగిలిన వారికి తెలుగు రాక పోవడంతో కుక్కునూరు ప్రాంతం నుంచి తీసుకొచ్చిన ఇద్దరు యువకులు మేజిస్ట్రేట్‌కు, మావోయిస్టులకు వారధులుగా గోండు భాషను తర్జుమా చేసి తెలుగులో మేజిస్ట్రేట్ ఎస్.మేరీకి వివరించారు. మేజిస్ట్రేట్ అడిగిన ప్రశ్నలను భాషను తర్జుమా చేసి మావో యిస్టులకు తెలిపి వారి సమాధానాన్ని తిరిగి వివరించారు. తండ్రి పేరు, ఊరు పేరు, ప్రాంతం వివరాలను అడిగారు. పోలీసులు అరెస్టు చేసినట్టు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారా.. అని అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ఇబ్బంది పెట్టారా, శరీరంపై ఏమైనా గాయాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఎన్ని గంటలకు అరెస్టు చేశారు వంటి ప్రశ్నలను అడిగి వారి నుంచి వివరాలు తెలుసు కున్నారు. ఒక్కొక్కరిని విడివిడిగా కోర్టులో హాజరు పరిచారు. వారికి ఆధార్ కార్డులు, ఇతర వివరాలు ఉండాలని మేజిస్ట్రేట్ పోలీ సులకు సూచించడంతో వారు అడవుల్లో ఉంటారని వారికి ఎలాంటి ఆధార్ కా ర్డులు ఉండవని, అరెస్టు చేసేటప్పుడు మధ్యవర్తులతో నిర్వహించిన పంచ నామా రిపోర్టులో పేర్కొనడంతో మేజిస్ట్రేట్ సంతృప్తి వ్యక్తం చేస్తూ 15 మంది మావోయిస్టులకు వచ్చేనెల 3వ తేదీ వరకు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలిం చడానికి ఆదేశాలు జారీ చేశారు.

సెంట్రల్ జైలుకు తరలింపు


ప్రత్యేక పోలీసు బలగాల మధ్య రాత్రి ఏడు గంటలకు ఏలూరు నుంచి రాజమండ్రి సెంట్రల్ జైలుకు మావోయిస్టులను తరలించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ స్వయంగా మహిళా పోలీస్‌స్టేషన్ భవనానికి వచ్చి మావోయిస్టులను కోర్టుకు తరలించేటప్పుడు ఆయనే స్వయంగా పరిశీలించారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, భీమడోలు సీఐ యూజేవిల్సన్, జంగారెడ్డిగూడెం సీఐ ఎంవీ సుభాష్, ఏలూరు రూరల్ ఎస్‌ఐ బి.నాగబాబు, నగరంలోని పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసుల పటిష్ఠ బందోబస్తు మధ్య వారిని కోర్టుకు హాజరుపరిచారు. 15 మంది మావోయిస్టులపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 330/2025 అండర్ సెక్షన్ 147, 148, 149, 189 (2)(4) రెడ్‌విత్ 61(2) బీఎన్‌ఎస్ యాక్టు, 13-18-20-21-38 అండ్ ఉప 25(1ఎ ఆమ్స్ యాక్టు) కింద కేసు నమోదు చేశారు.

ముందుగానే అప్రమత్తం

(5వ పేజీ తరువాయి)

తీరానికి చేరుకుని నది దాటి వచ్చి ఉంటారన్న కోణంలోను దర్యాప్తు చేస్తున్నారు. నదిలో చేపల వేట సాగించే జాలర్లను అప్రమత్తం చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై సమాచారం అందించాలని కోరారు. కూనవరం, రుద్రమ్మకోట, పడవరేవు మీదుగా మావోయిస్టులు జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలు ఉండడంతో వేలేరుపాడు ఎస్‌ఐ నవీన్‌కుమార్ పోలీస్ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహిస్తు న్నారు. మావోయిస్టుల కదలికలపై ఎస్‌ఐను వివరణ కోరగా 'ప్రస్తుతం మండలంలో మావో యిస్టుల కదలికలపై ఎలాంటి సమాచారం లేదు. ఉన్నతాధికారుల సూచనలతో తనిఖీలు చేపడుతున్నాం' అని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



తాను సాగుచేసిన గడ్డి చేలో బొట్టు రామచంద్రరావు

హెడ్జ్ లూసర్న్‌తో పాల వెల్లువ

▸ నూతన పశుగ్రాసాన్ని సాగుచేసిన పాడిరైతు ▸ పశువులకు బలవర్ధకమన్న వైద్యులు

చాట్రాయి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) హెడ్జ్ లూసర్న్ పశు గ్రాసం రైతులు సాగు చేస్తే పాల దిగుబడి, పశువులు ఆరోగ్యం మెరుగుపడటమే కాక పశుగ్రాస వ్యయం తగ్గుతుందని పశువైద్య నిపుణులు అంటున్నారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు సూచనతో, మండలంలోని చీపురుగూడెం గ్రామంలో పాడిరైతు, యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు తన సొంత భూమి 2 ఎకరాల్లో, ఈ ప్రాంతంలో తొలిసారి హెడ్జ్ లూసర్న్ పశుగ్రాసం సాగు చేశారు. హైదరాబాద్ నుంచి కేజీ రూ. 700 చొప్పున 20 కేజీలు విత్తనాలు తెచ్చి సాగు చేసినట్లు రామచంద్రరావు చెప్పారు. ఈ పశుగ్రాసంలో మాంసకృత్తులు అధికంగా ఉండటం వల్ల పాల దిగుబడి పెరుగుతుందని, దీనిని పచ్చిమేతగాను, ఎండబెట్టి వేసవిలో ఎండు మేతగా ఉపయోగించవచ్చునని అన్నారు. లూసర్న్ పశుగ్రాస పంటను ఒకసారి విత్తుకుంటే 4 ఏళ్ళ పాటు దిగుబడి ఇస్తుందని, శాశ్వత మొక్క కావటం వల్ల ఏళ్ల తరబడి తక్కువ నీటితో ఎక్కువ గడ్డి లభిస్తుందని, ఎండా కాలంలో పశుగ్రాసం కొరత తగ్గిస్తుందని అన్నారు.

పోషక విలువలు మెండు



హెడ్జ్ లూసర్న్ గ్రాసంలో 16-20 శాతం మాంసకృత్తులు, 16-24 శాతం క్రూడ్ ప్రొటీన్ ఉండటం వల్ల ఆహారం జీర్ణమయ్యే శక్తి పెరిగి పశువుల పాల దిగుబడి మెరుగుపడుతుంది. అంతే కాక భూ సారం పెరుగుతుంది. ఈ పంటకు లోతైన వేర్లు ఉండటం వలన ఎండకు తట్టుకునే శక్తి, దీర్ఘకాలం పైరు పచ్చగా ఉంటుంది.

- డాక్టర్ కె. నరసింహరావు,
సహాయ సంచాలకులు,
నూజివీడు ప్రాంతీయ పశు వైద్యశాల



మాట్లాడుతున్న గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

రైతుల పక్షపాతి చంద్రబాబు

నూజివీడు టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హామీని నిలబెట్టుకుని రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేసి సీఎం చంద్రబాబునాయుడు రైతు పక్షపాతిగా నిలిచారని, నూజివీడు నియోజకవర్గంలో 35,529 మంది రైతులకు రూ. 23.39 కోట్లు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. నూజివీడు నియోజకవర్గ స్థాయిలో రావిచర్లలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గత ప్రభుత్వం పంటల బీమా, బిందు సేద్యం, పంట ప్రోత్సాహకాలను రద్దు చేస్తే కూటమి ప్రభుత్వం 90 శాతం రాయితీపై బిందు సేద్య పరికరాలు, 80 శాతం రాయితీపై డ్రోన్లను అందించింద న్నారు. వంద శాతం రాయితీపై పామాయిల్ మొక్కల ను రైతులకు అందించిందన్నారు. నూజివీడు మాజీ ఏఎంసీ చైర్మన్, రావిచెర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావు, నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు వేములకొండ శ్రీనివాసరావు, నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష, నూజివీడు తహసీల్దార్ బద్రు వ్యవసాయశాఖ అధికారి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

● అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని బత్తులవారిగూడెం సర్పంచ్ ముసునూరి లక్ష్మీకాంతమ్మ అన్నారు. బత్తులవారి గూడెంలో రైతులతో కలిసి చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకాన్ని నిర్వహించారు. టీడీపీ నూజి వీడు మండల మాజీ అధ్యక్షుడు ముసునూరి రాజా, డిప్యూటీ తహసీల్దార్ సింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా రైతు పెట్టుబడి సాయం రూ. 7 వేలు విడుదల సందర్భంగా వ్యవసాయ కార్యాలయంలో ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు రైతులు, నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ పథకాల ద్వారా లబ్ధి పొందిన రైతులను నాయకులు, అధికారులు సన్మానించారు. మండలంలో 825 మంది రైతులకుగాను రూ. 5.48 కోట్ల నగదు జమ చేయడం జరిగిందని ఏవో చాముండేశ్వరి తెలిపారు.



ముసునూరులో సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం

చాట్రాయి: రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. చనుబండ రైతుసేవా కేంద్రంలో బుధవారం ప్రధాని ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. మండలంలో 8075 మంది రైతుల ఖాతాల్లో రూ. 5.33 కోట్లు, చనుబండలో 520 మంది రైతుల ఖాతాల్లో 36.40 లక్షలు జమ చేయటం గొప్ప విషయమన్నారు. సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పరిశీలనకు వచ్చిన జిల్లా పరీక్షల పరిశీలనాధికారి ఆశా

పరీక్షా కేంద్రాల పరిశీలన

ఆగిరిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా పరీక్షల పరిశీలనాధికారి ఆర్. ఆశా తనిఖీ చేశారు. 2026లో జరగనున్న పరీక్షలకు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో-1 హేబేలు, హెచ్‌ఎం పుష్పలత పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

ముసునూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఆధార్ కార్డును అప్‌డేట్ చేసేలా ఉపాధ్యాయులు, తల్లితండ్రులు సహకరించాలని ముసునూరు ఎంపీడీవో పిల్లి ఏసుబాబు కోరారు. ముసునూరు జడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ముసునూరు ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏపీఎంగా వెంకటరత్నం

చాట్రాయి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల వెలుగు ఇన్‌చార్జి ఏపీఎంగా ఎం. వెంకటరత్నం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇక్కడ సీసీగా పనిచేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకారంతో మండలంలో మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని వెంకటరత్నం చెప్పారు.



ముదినేపల్లిలో వ్యవసాయ యంత్ర పరికరాలు, నూతన వరి వంగడాలను పరిశీలిస్తున్న మంత్రి

వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచాలి

మంత్రి నాదెండ్ల మనోహర్

ముదినేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, యాంత్రీకరణ పెంపునకు రైతులు ముందుకు రావాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ముదినేపల్లిలో బుధవారం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదలకు విచ్చేసిన సందర్భంగా వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన యంత్ర పరికరాలు, నూతన వరి వంగడాలను మంత్రి పరిశీలించారు. ముదినేపల్లి ప్రాంతంలో డ్రోన్లను వినియోగించడంపై ఆయన రైతులను అభినందించారు. పంటల సాగులో ఏఐ డిజిటల్ సేవలు, శాటిలైట్ పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, కలెక్టర్ వెట్రిసెల్వి, వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా, తహసీల్దార్ లతీఫ్, ఎంపీడీవో వై రామకృష్ణ, ఏవో వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపానికి కృషి : కామినేని

కైకలూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నియోజకవర్గ కాపు సంక్షేమ సంఘం, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ఆధ్వర్యంలో వనసమారాధనను నిర్వహించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, బడేటి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ కాపు కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కైకలూరులో 50 సెంట్ల స్థలాన్ని సేకరించి అందిస్తానని, కల్యాణ మండప నిర్మాణానికి రూ.1.50కోట్లు ఖర్చు అవుతుందని ఈ ఖర్చులో సగభాగం పారిశ్రామికవేత్త కూనపురెడ్డి వెంకటేశ్వరరావు భరిస్తానని ఫోన్ ద్వారా హామీ ఇప్పించారు. నియోజకవర్గంలో మెరిట్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున సుధామ ఫౌండేషన్ విజయకుమార్ అందజేశారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ పంచకర్ల సందీప్, పశ్చిమ గోదావరి జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి చలమలశెట్టి చంద్రశేఖర్, కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్, లేబర్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లగోపుల చలపతి, కాపు సంక్షేమ సంఘం నాయకులు తెలగంశెట్టి శ్రీనివాసరావు, అద్దంకి వెంకట శ్రీనివాస రావు, ఏఎన్ బాబు, పైడిపాటి శివశంకర్, కొల్లి వరప్రసాద్, మంగినేని రామకృష్ణ, తోట లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవాసమితి సేవలు అమూల్యం

సత్యసాయి సేవా సమితి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కైకలూరు సత్యసాయి సేవాసమితిలో పేదలకు చీరలను ఎమ్మెల్యే కామినేని చేతులమీదుగా పంపిణీ చేశారు. సత్యసాయిబాబా పై కైకలూరు విద్యాంజలి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఎస్ జమీల్‌అహ్మద్ రచించి



ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న కాపు సంఘీయులు

ఆలపించిన పాటను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, సర్పంచ్ కేవీఎస్‌ఎం నాయుడు, జనసేన నాయకుడు నల్లగోపుల చలపతి, మానవత సేవా సంస్థ సభ్యులు గుర్రం శ్యాంకుమార్, సేవాసమితి సభ్యులు వీరప్పన్, కృష్ణమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి

ముదినేపల్లి: గ్రామాల్లో అంతర్గత రహదారులను అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కామినేని తెలిపారు. బుధవారం మండలంలోని సంకర్షణపురం, పెనుమల్లి, గురజ గ్రామాల్లో నరేగా నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతను కాపాడేందుకు అంతర్గత రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను కూడా మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పెనుమల్లిలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద దాత నిర్మించిన షెడ్డును కూడా ఆయన ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు శోభనాద్రి చౌదరి, కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ బుర్రా చలమయ్య, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



జాహ్నవి (ఫైల్)

గోదావరిలో జాహ్నవి మృతదేహం లభ్యం

యలమంచిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన తండ్రి, కుమారుడు, కుమార్తె చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మ హత్యకు పాల్పడిన ఘటనలో కుమార్తె జాహ్న వి(11) మృతదేహం బుధవారం లభ్య మైంది. తండ్రి శిరిగినీడి దుర్గాప్రసాద్ (43), కుమారుడు మోహిత్(14) మృతదేహాలు మంగళ వారం లభ్య మైన విషయం విదితమే. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు యలమంచిలి ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. లక్కవరంలో విషాదఛాయలు అలముకున్నాయి.

విద్యుదాఘాతంతో ఉద్యోగి మృతి



మృతుడు రమేష్

ఏలూరు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రపరుస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగి డ్రైవర్‌పై పడ డంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు చాణక్యపురి కాలనీలో నివాసం ఉంటున్న రమేష్ (32)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్‌పై ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏలూరు అశోక్‌నగర్ బ్రిడ్జి వద్ద శ్మశాన వాటికను శుభ్రప రుస్తుండగా ఎక్స్‌కవేటర్ నడుపుతున్న రమేష్‌పై ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగి పడడంతో అతను విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు నగరపాలక కమిషనర్ భాను ప్రతాప్ మృతదేహాన్ని పరిశీలించి మృతుని కుటుంబీకులను పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బి. సోమయ్య, బద్దా వెంకటరావు, జి వెంకటేశ్వరరావు, రత్నబాబు, కె. విజయలక్ష్మి, పంతగాని రాజేష్, పెద్దిరాజు తదితరులు రమేష్ మృతదేహాన్ని సందర్శించారు. రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని ఆయన భార్యకు ఉద్యోగం ఇవ్వాలని మునిసిపల్ అధికారులను డిమాండ్ చేశారు.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

ఆకివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిందితుడికి భీమవరం కోర్టు ఆరు నెలలు జైలు, రూ.2 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ హనుమంతు నాగరాజు బుధవారం తెలిపారు. సిద్ధాపురానికి చెందిన కలిదిండి సత్యనారాయణరాజు 2021లో వ్యవసాయ పని నిమిత్తం కళింగగూడెం వెళ్ళి తిరిగి వస్తుండగా మద్యం షాపు దగ్గర లారీ డ్రైవర్ బీవీవీ సత్యనారాయణ అతివేగంగా ఢీకొట్టడంతో సత్యనారాయణరాజు అక్కడకక్కడే మృతి చెందాడు. అప్పటి ఎస్‌ఐ వై.కిరణ్ కుమార్ కేసు నమోదు చేశారు. బుధవారం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సురేష్‌బాబు ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

వ్యక్తిగత కక్షతో హత్యాయత్నం

భీమడోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షతో భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన నిటా నాగరాజుపై నలుగురు దాడి చేశారు. ఈ నెల 18వ తేదీన అదే గ్రామానికి చెందిన గొల్ల గౌతమ్, కాళీ రాజకుమార్, బొంతు శివకుమార్, సిరికోట నరేంద్రవర్మ నాగరాజుపై దాడి చేసి బీరుసీసా పగులగొట్టి పొడిచినట్లు పోలీసులు తెలిపారు. నాగరాజును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



చాట్రాయి సెంటర్‌లో ట్రాఫిక్ పరిస్థితి

ట్రా'ఫికర్'

చాట్రాయి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చాట్రాయిలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జటిలం అవుతుండటంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలను కలిపే రహదారిలో చాట్రాయి ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు చాట్రాయి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు సూర్యాపేట-రాజమహేంద్రవరం మధ్య నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి చాట్రాయి మీదుగా భారీ వాహనాలతో మెటల్ తరలిస్తున్నారు. చాట్రాయిలో రోడ్లు బాగా ఇరుకుగా ఉంటాయి. వ్యాపార సంస్థలు, హోటళ్ళ, ఇతర దుకాణాలు గ్రామ కూడలిలోనే ఉన్నాయి. కొద్దిసేపు ట్రాఫిక్ ఆగితే పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ కనీసం బస్‌షెల్టర్ కూడా లేకపోవటంతో ఆర్టీసీ బస్సులను ట్రాఫిక్ రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించటం దించటం చేస్తున్నారు. ఇంత ట్రాఫిక్‌లో కూడా కొంత మంది వాహనాలను అతి వేగంగా నడుపుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుందో అని జనం హడలిపోతున్నారు. రెండు వాహనాలు ఎదురు ఎదురుగా వస్తే తప్పుకోవటం బ్రహ్మప్రళయమే.





చనుబండ, కలిదిండి శాఖా గ్రంథాలయాల్లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

మహిళలకు ఆదర్శం ఇందిర

చాట్రాయి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీని అదర్శంగా తీసుకొని మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణించాలని మహిళా పోలీస్ విజయలక్ష్మి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చనుబండ గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించి, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు జరిగాయి. అంగన్వాడీ టీచర్లు భారతి, జ్యోతి, దుర్గాభవానీ, గ్రంథాలయ అధికారి శ్రీకాంత్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు, విద్యార్థులు ఇందిర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కొరుకొల్లు గ్రంథాలయంలోను పోటీలు జరిగాయి.

కైకలూరు: కైకలూరు శాఖా గ్రంథాలయంలో సాహితీ మిత్రుల ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకటనారాయణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు, గ్రంథాలయాధికారి కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సరస్వతీ స్కూల్ విద్యార్థులు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. బాలికలు వేసిన రంగుల ముగ్గులు అలరించాయి. ఈ పోటీలకు మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు డి. విజయ దుర్గ, సీహెచ్ అరుణ, న్యాయ నిర్ణేతలుగా వ్యవహ రించారు. గ్రంథాలయం అధికారి ఈజీ ఎస్‌వి కుమార్ తెలిపారు.



చనుబండలో ముగ్గుల పోటీలు